నేటి కందం- నేటికి అందం

**సుందర మంచిర్యాల ప**
**సందును బొందంగ బండి సంజయ్ చౌరవన్**
**వందే భారత్ రైలున**
**కందముగా నొసగినారు హాల్టును ధృతిలోన్ !!**

వందేభారత్ రైలు కు వ్యాపార కేంద్రం అయిన మంచిర్యాల లో హాల్టును ఏర్పాటు చేశారు. దీనితో సామాన్య ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంది. ఈ సందర్భంగా మంత్రి బండి సంజయ్ హాజరై రైలుకు పచ్చజెండా ఊపారు

-రాధశ్రీ
సెల్:9494481210



# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

చురక

భార్య భర్తలెవరైనా
బంధాలే ముఖ్యము
స్పర్థలుంటే సర్దుబాటు
చేసుకొనుడే సౌఖ్యము.
అసాధ్యం మార్పంటే
హత్య కాదు పరిష్కృతి
చట్టపరం విడిపోయి
జీవించుడే సంస్కృతి

-వేల్పుల నారాయణ
9440433475



హైదరాబాద్ బుధవారం 17-9-2025 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-50 001. సంపుటి :32 సంచిక:32 పేజీలు:6 వెల: రూ.1/-


# కమ్యూనిస్టుల బలోపేతంతోనే సమాజాభివృద్ధి

## – మంత్రి ఉత్తమ్




కోదాడ, సెప్టెంబర్ 16 : బడుగు బలహీన వర్గాలు, పేద ప్రజల పక్షాన అవిశ్రాంత పోరాటం నిర్వహించేది కమ్యూనిస్టులే.. ప్రతిపక్షంగా నిత్యం ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు చట్టసభల వెలుపల ఉద్యమాలు నిర్వహిస్తున్న కమ్యూనిస్టులు బలోపేతం అయితేనే సమాజం అభివృద్ధి చెందుతుందని రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. మంగళవారం కోదాడ మేళ్లచెరువు కాశీనాథం ఫంక్షన్ హాల్‌లో సిపిఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి, నల్లగొండ మాజీ ఎంపీ, దివంగత సురవరం సుధాకర్ రెడ్డి సంతాప సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కష్టాలకు, నష్టాలకు ఓర్చి ఎన్ని అడ్డంకులు వచ్చినా పేద ప్రజల పక్షాన నిలబడేది ఎర్రజెండా వారసులేనన్నారు. వామపక్ష పార్టీలతో తనకు మూడు దశాబ్దాల అవ్యాజనుబంధం ఉందన్నారు. విద్యార్థి దశ నుంచి అంచలంచెలుగా భారత కమ్యూనిస్టు పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి స్థాయికి ఎదిగిన ఆదర్శప్రాయుడు సురవరం సుధాకర్ రెడ్డి అని ఆయన కొనియాడారు.

ఆయనతో తనకు వ్యక్తిగత అనుబంధం కూడా ఉందని నల్లగొండ జిల్లా సమస్యలతో పాటు దేశ సమస్యలను పార్లమెంట్ సమావేశాల్లో వాడిగా వేడిగా వినిపించిన చరిత్ర సురవరంకు ఉందన్నారు. తన జీవితాంతం కమ్యూనిస్టు సిద్ధాంతాన్ని ఆచరించిన నికార్సైన నేత అన్నారు. రూ. 1,800 కోట్లతో ఆయన కలలుగన్న డిండి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేస్తానని భరోసా ఇచ్చారు. కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల అభివృద్ధికి తాను, తన సతీమణి పద్మావతి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే వందల కోట్ల రూపాయలతో అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నట్లు వెల్లడించారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికి రేషన్ కార్డు మంజూరు చేస్తామని, సన్న బియ్యం పథకం దేశంలోనే ఎక్కడా అమలు చేయడం లేదని ఈ పథకం చారిత్రాత్మకమని ఆయన పేర్కొన్నారు.

వామపక్ష ఉద్యమాలకు దిక్సూచి సురవరం : పల్లా వెంకట్‌రెడ్డి

అఖిల భారత విద్యార్థి సంఘం నాయకుడిగా. యువజన నాయకుడిగా, రాష్ట్ర కార్యదర్శిగా, అనుబంధ సంఘాల బాధ్యుడిగా తన నిబద్ధతతో అంచెలంచెలుగా ఎదిగి భారత కమ్యూనిస్టు పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించిన సురవరం సుధాకర్ రెడ్డి వామపక్ష ఉద్యమాలకు దిక్సూచి అని సిపిఐ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకటరెడ్డి అన్నారు. సురవరం సంతాప సభలో పాల్గొన్న ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధ పోరాట వారసత్వ నేతగా తన తుది శ్వాస వరకు ప్రజల పక్షాన నిలిచిన మహనీయుడని కొనియాడారు. ఉపాధి హామీ చట్టం, సమాచార హక్కును చట్టం ఏర్పాటులో కీలక భూమి పోషించినట్లు తెలిపారు. వామపక్ష పార్టీల కలయికను ఆయన ఆకాంక్షించారని, అందుకు కొంత ప్రయత్నం కూడా చేశారని, ఆయన స్ఫూర్తిని కొనసాగించడమే మనమిచ్చే నివాళి అని పల్లా పేర్కొన్నారు.

నల్లగొండ ఎంపీ రఘువీర్ రెడ్డి మాట్లాడుతూ.. నల్లగొండ జిల్లా అభివృద్ధికి పార్లమెంటు సభ్యుడిగా సురవరం ఎనలేని కృషి చేసినట్లు తెలిపారు. ఆయన స్ఫూర్తిగా తీసుకుని జిల్లా అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ..విద్యార్థి దశ నుంచి జాతీయస్థాయికి ఎదిగిన నిబద్ధత కలిగిన నేత సురవరం అన్నారు. బెజవాడ వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో ఎమ్మెల్సీ శంకర్ నాయక్, సిపిఐ నాయకులు గన్న చంద్రశేఖర్, బొమ్మగాని ప్రభాకర్, మేకల శ్రీనివాసరావు, బద్దం కృష్ణారెడ్డి, హనుమంతరావు, ధనుంజయ నాయుడు, ఉస్తేల సృజన, మండలం వెంకటేశ్వర్లు, నారాయణరెడ్డి, గుండు వెంకటేశ్వర్లు, కంబాల శ్రీనివాస్, మల్లీశ్వరి, భద్రారెడ్డి, సిపిఎం నాయకులు ములకలపల్లి రాములు, మేదరమెట్ల వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ నాయకులు చింతకుంట లక్ష్మినారాయణ రెడ్డి, వంగవీటి రామారావు పాల్గొన్నారు.

# ఉత్తరాఖండ్‌లో మళ్లీ క్లౌడ్ బరస్ట్.. వరదల్లో పలువురు గల్లంతు



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 16:ఉత్తరాఖండ్ రాష్ట్రంలో మరోసారి క్లౌడ్ బరస్ట్ సంభవించింది. రాజధాని డెహ్రాడూన్ లో మెరుపు వరదలు బీభత్సం సృష్టించాయి. సహస్త్రధారలో వరద ధాటికి పలువురు గల్లంతయ్యారు. వరదతోపాటు వచ్చిన బురద, ఇతర శిథిలాల తాకిడికి అనేక ఇళ్లు, దుకాణాలు, హోటళ్లు దెబ్బతిన్నాయి.

రహదారులపైకి భారీగా వరద చేరడంతో వాహనాలు నీటిలో కొట్టుకుపోయాయి. రిషికేశ్‌లో చంద్రభాగనది ప్రమాదకరంగా ప్రవహిస్తోంది. నది ఉధృతంగా ప్రవహిస్తుండటంతో అందులో పడి ఐదుగురు కొట్టుకుపోయారు. నది వరదలో చిక్కుకున్న మరో ముగ్గురిని నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ సిబ్బంది రక్షించారు.

అదేవిధంగా తమ్సా, టన్స్, సాంగ్ నదులు కూడా ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలను ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు సురక్షిత ప్రాంతాలకు తరలించాయి. పునరావాస కేంద్రాల్లో వారికి ఆశ్రయం కల్పించాయి.

# విలీనమా..? విమోచనమా..?

గతంలో సెప్టెంబర్ 17 ను తెలంగాణ సమైక్యత దినోత్సవం(విలీన దినోత్సవం)గా నిర్వహిస్తే,2024 మార్చిలో కేంద్ర ప్రభుత్వం విమోచన దినోత్సవంగా నిర్ణయం తీసుకోవడంతో పాటు హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్లో అధికారిక కార్యక్రమాలు నిర్వహించింది. ఈ సందర్భాన్ని విచారంగా ఆరంభించాలా? వినోదంగా ముగించాలా ? అనే ఆందోళనలో ప్రజలు విభిన్న ఆలోచన ధోరణిని కలిగి ఉన్నారు. సెప్టెంబర్ 17 అనే అంశం మతపరమైన నేపథ్యంతో ముడిపడి ఉండడంతో దాదాపు హైదరాబాద్ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా జరపడానికి అధికారంలో ఉన్న గత ప్రభుత్వాలు వెనుకంజ వేశాయి.

విమోచనమంటే విడుదల,విముక్తి పొందడం లేదా కోల్పోయిన దానిని తిరిగి పొందడం అనే అర్థం వస్తుంది. ఈ ప్రతిపాదన విచ్చిన్నానికి కారణం అవుతుంది. నిజాం నిరంకుశ పాలన నుండి విముక్తి పొందారా? లేదా అంతకుముందు కాలంలో పొందిన సుఖాలను ప్రజలు ఇక ముందు అనుభవిస్తారా? జైలు లాంటి నిజాం రాజ్య సరిహద్దుల నుండి విడుదల పొందారా? అనే కోణంలో ఒక్కసారి 1946-48 కాలంనాటి చరిత్రను స్పృశిస్తే హైదరాబాద్ రాజ్యంలో నెలకొన్న పరిస్థితులు శారీరకంగా, మానసికంగా, నైతికంగా నిజాం ప్రభుత్వంలో ప్రజలు తమ అస్తిత్వాన్ని కోల్పోయారు.

భారతదేశంలో హైదరాబాద్ సంస్థాన విలీనానికి నిజాం అంగీకరించలేదు. రజాకారుల కార్యకలాపాలు శాంతికి భంగం కలిగించిన నేపథ్యంలో జనమంతా ఆందోళనకు గురయ్యారు. 1948 సెప్టెంబర్ 13న కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పోలీస్ చర్యగా మారింది. దీనికి ఆపరేషన్ పోలో అని పేరు పెట్టారు.మేజర్ జనరల్ ఏ.ఔ చౌదరి నాయకత్వంలో భారత సైన్యం మూడు వైపుల నుంచి ముట్టడించి 1948 సెప్టెంబర్ 17న భారత యూనియన్ లో హైదరాబాద్ సంస్థానాన్ని విలీనం చేసింది.ఈ పరిస్థితుల నేపథ్యంలో తెలంగాణ సాయుధ పోరాటం 1946- 51 మధ్య కమ్యూనిస్టుల నాయకత్వం ఉధృతంగా కొనసాగుతుంది. హైదరాబాద్ స్టేట్ లో అంతర్భాగంగా ఉన్న తెలంగాణ ప్రాంతం బ్రిటిష్ పాలనతో ఎలాంటి సంబంధం లేకుండా నిజాం ఆధీనంలో ఉంది. ప్రస్తుత తెలంగాణతో పాటు మరాఠ్వాడ, బీదర్ ప్రాంతాలు హైదరాబాద్ సంస్థానంలో ఉండేవి. మూడు భాషా ప్రాంతాలకు చెందిన మొత్తం 16 జిల్లాలకు గాను 8 జిల్లాలు తెలంగాణ ప్రాంతానికి చెందినవి కాగా మరాఠా,కన్నడ ప్రాంతాలకు చెందినవి 8 జిల్లాలు. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి హైదరాబాద్ ప్రాంత ప్రజలకు స్వేచ్ఛ లేకపోవడాన్ని ప్రజలు సహించలేకపోయారు.

రామానంద తీర్థ నేతృత్వంలో ఆర్య సమాజ ఉద్యమాలు,కమ్యూనిస్టు నాయకుల ఆధ్వర్యంలో సాయుధ పోరాటాలు ఉధృతమయ్యాయి. మొదట నల్గొండ జిల్లాలో ప్రారంభమైన ఉద్యమం నైజాం సంస్థానం అంతా వ్యాపించింది. కాళోజి నారాయణరావు, షోయబుల్లాఖాన్, సూరారం ప్రతాపరెడ్డి ,మాడపాటి హనుమంతరావు, బొమ్మగాని ధర్మ బిక్షం,ఆరుట్ల కమలాదేవి,మల్లు స్వరాజ్యం,రావి నారాయణరెడ్డి, చంద్ర రాజేశ్వరరావు తదితర తెలంగాణ సాయుధ పోరాట యోధులు, కవులు, రచయితలు, చేసిన ఉద్యమ ఫలితంగా 1948లో ఉద్యమం ఉధృత రూపం దాల్చి హైదరాబాద్ రాష్ట్రం భారత యూనియన్ లో విలీనానికి దారితీసింది.

భిన్న కాలాల పరిస్థితుల దృష్ట్యా ప్రజల ఆలోచనలు మారుతూ ఉంటాయి. చరిత్ర లోని గాయాల్ని చెరపడం అంత సులువేమి కాదు .

కానీ ప్రజల మధ్య అగ్గి రాజేసే చరిత్రను రాజకీయంగా వాడుకోవడం కూడా సరైనది కాదు.ఏదేమైనా మత సామరస్యాన్ని వీడి ప్రజల శ్రేయస్సే ప్రభుత్వాల అంతిమ లక్ష్యం అనే విషయాన్ని మర్చిపోకుండా, మనోభావాలు దెబ్బతినకుండా అభివృద్ధి పథంలో కొనసాగాలి. తెలంగాణ ప్రజల్లో ప్రస్తుతం ఉన్న ఐక్యత భవిష్యత్తులోనూ విచ్చిన్నం చెందకుండా ఉండాలని భావిస్తూ అధికార, ప్రతిపక్ష పార్టీలు విలీన, విమోచన అనే విధ్వంసకర తారతమ్య అభిప్రాయాలు ప్రజల మధ్య రాకుండా ప్రభుత్వాలు కృషి చేయాలి.

-గడ్డం లింగస్వామి
9010081146

# తెలంగాణ రైతు సంక్షేమం దేశం మొత్తానికి ఆదర్శం: తుమ్మల

హైదరాబాద్, సెప్టెంబర్ 16:: రైతులందరికీ ఉపయోగపడే విధంగా స్కీములన్నిటిని ఒకే గొడుగు కిందకు కేంద్ర ప్రభుత్వం తీసుకు రావాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. దేశ రైతాంగానికి ఉపయోగపడే పాలసీలను రూపొందించే కార్యక్రమం ఏర్పాటు చేసినందుకు కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ని ఈ సందర్భంగా అభినందిస్తున్నానని పేర్కొన్నారు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు.

ఇవాళ(మంగళవారం) నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ అగ్రికల్చర్ రబీ క్యాంపెయిన్ – 2025ను కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఆధ్వర్యంలో పలు రాష్ట్రాల వ్యవసాయ శాఖ మంత్రులు, కార్యదర్శులు, వ్యవసాయ శాఖ నిపుణులతో నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొన్నారు. రైతును ఏ రకంగా కాపాడాలి, రైతు ఆదాయాన్ని ఏ రకంగా పెంచాలి, భవిష్యత్తులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఈ సమావేశంలో చర్చించారు.

ఈ సమావేశంలో కొన్ని అంశాలపై ప్రస్తావించడం జరిగిందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. 1960లో చేసిన విత్తన చట్టం ఇప్పటికీ కొనసాగుతోందని చెప్పుకొచ్చారు. ఇప్పటివరకు ఈ అంశాన్ని ఎందుకు పునః పరిశీలించలేదని ప్రశ్నించారు. దానివల్ల విత్తన కంపెనీలు దగా, మోసం చేసిన రైతులు నష్టపోయిన ఏ మాత్రం వెసులుబాటు లేదని తెలిపారు.

# ట్రాన్స్‌జెండర్‌లకు గౌరవం.. రేవంత్ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం

హైదరాబాద్, సెప్టెంబర్ 16:హైదరాబాద్ మెట్రో లో 20 మంది ట్రాన్స్‌జెండర్ల ను సెక్యూరిటీ గార్డులుగా నియమించింది తెలంగాణ ప్రభుత్వం ఈ క్రమంలో మెట్రో రైల్ లిమిటెడ్ సెక్యూరిటీ గార్డులుగా నియమిస్తూ నియామక పత్రాలు అందజేశారు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్. సెక్యూరిటీ గార్డు నియామకాల కోసం దాదాపు 300 మంది



నుంచి 400 మంది దరఖాస్తు చేసుకోగా, నైపుణ్యం కలిగిన వారిని ఎంపిక చేసింది రేవంత్‌రెడ్డి ప్రభుత్వం.

ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మీడియాతో మాట్లాడారు. ట్రాన్స్‌జెండర్ల అభ్యున్నతికి, వారు ఆత్మగౌరవంతో జీవించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంకల్పించారని.. ఈ నేపథ్యంలోనే వీరిని నియమించారని పేర్కొన్నారు. ట్రాన్స్‌జెండర్ల సమాజంలో గౌరవంగా బతకాలనే ఉద్దేశంతో ఈ అవకాశం కల్పించామని ఉద్ఘాటించారు. వారు కష్టపడి పనిచేయాలని సూచించారు. ఇతర ట్రాన్స్‌జెండర్లకు కూడా ఆదర్శంగా నిలవాలని చెప్పుకొచ్చారు. వీరు ఈ సమాజానికి ఏ మాత్రం తక్కువ కాదని నిరూపించుకోవాలని తెలిపారు. ట్రాన్స్‌జెండర్‌లకు ఇచ్చిన హామీలను సీఎం రేవంత్‌రెడ్డి కచ్చితంగా అమలు చేస్తారని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు.

# బతుకమ్మ షార్ట్ ఫిల్మ్ పోటీలకు దరఖాస్తుల ఆహ్వానం..

హైదరాబాద్, సెప్టెంబర్ 16: తెలంగాణలో బతుకమ్మ పండుగ ను ఎంతో ఘనంగా నిర్వహించుకుంటారు. బతుకమ్మకు సంబంధించిన పాటలను పాడుకుంటూ మహిళలు సందడిగా చేసుకుంటారు. బతుకమ్మ పండుగ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది.

తెలంగాణలోని యువ సృజనశీలురకు పట్టం కట్టేందుకు తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ బతుకమ్మ యంగ్ ఫిల్మ్ మేకర్స్ ఛాలెంజ్ పేరిట షార్ట్ ఫిలిమ్స్ పోటీలు ( నిర్వహిస్తోంది. మూడు నిమిషాలు, ఐదు నిమిషాల్లోపు నిడివి కలిగిన రెండు కేటగిరీల్లో షార్ట్ ఫిలిమ్స్‌కు పంపించాలని ఎఫ్‌డీసీ చైర్మన్ దిల్ రాజు సూచించారు.

# ఉప్పల్ - సికింద్రాబాద్ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం

హైదరాబాద్, సెప్టెంబర్ 16:నగరంలోని ఉప్పల్ – సికింద్రాబాద్ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. అతి వేగంగా దూసుకువచ్చిన ఓ సెప్టిక్ ట్యాంకర్.. ఉప్పల్ రహదారి మధ్యలో ఉన్న హనుమాన్ ఆలయంలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదం నుంచి భక్తులు, వాహనదారులు తృటిలో తప్పించుకున్నారు. ఎలాంటి ప్రాణ నష్టం సంభవించలేదు.

సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. తీవ్ర గాయాలపాలైన సెప్టిక్ ట్యాంకర్ డ్రైవర్ కుమార్ నాయక్‌ను చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. అతి వేగం వల్లే ప్రమాదం జరిగినట్లు పోలీసులు నిర్ధారించారు. ఈ ప్రాంతంలో తరుచుగా ప్రమాదాలు జరుగుతూనే ఉంటాయి. ఈ ప్రమాద ఘటనకు సంబంధించి సీసీటీవీ పుటేజీని పోలీసులు విడుదల చేశారు.

# సికింద్రాబాద్‌లో భారీగా గంజాయి స్వాధీనం.. ఏపీ మహిళా అరెస్ట్

హైదరాబాద్, సెప్టెంబర్ 16: సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో భారీగా గంజాయి పట్టుబడింది. గంజాయిని తరలిస్తున్న ఏపీ మహిళను జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన గంజాయి విలువ రూ. 3.94 లక్షలు ఉంటుందన్నారు.

వివరాల్లోకి వెళ్తే.. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో సోమవారం జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీసులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. షోలాపూర్ వెళ్తున్న కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో భారీగా గంజాయి పట్టుబడింది. గంజాయి తరలిస్తున్న ఇద్దరిలో ఒకరు పట్టుబడగా, మరొకరు పరారీ అయ్యారు.

పట్టుబడిన మహిళను ఏపీ అల్లూరి సీతారామరాజు జిల్లాలోని పాడేరుకు చెందిన బీ లక్ష్మి(40) గా పోలీసులు గుర్తించారు. ఆమె వద్ద నుంచి 7.9 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని, దాని విలువ రూ. 3.94 లక్షలు ఉంటుందని తెలిపారు పోలీసులు. పరారైన వ్యక్తిని షోలాపూర్‌కు చెందిన బోన్యాగా గుర్తించారు. అతన్ని కూడా త్వరలోనే పట్టుకుంటామని, గతంలో అతనిపై గంజాయి కేసులు నమోదు అయ్యాయని తెలిపారు.

అయితే గంజాయి తరలించినప్పుడల్లా లక్ష్మికి రూ. 3 వేలు బోన్యా ఇచ్చేవాడని పోలీసుల విచారణలో తేలింది. షోలాపూర్‌లో బోన్యా గంజాయిని విక్రయిస్తూ జీవితం కొనసాగిస్తున్నట్లు తేలింది.

# హెల్మెట్ ధరించడం వల్ల ప్రాణాలు నిలుస్తాయి.. హెల్మెట్ల పంపిణీలో నిజామాబాద్ సీపీ




నిజామాబాద్, సెప్టెంబర్ 16: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం వల్ల ప్రమాదం జరిగిన సమయంలో ప్రాణ నష్టం జరగకుండా ఉంటుందని, దీన్ని గ్రహించి ప్రతి ఒక్క ద్విచక్ర వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి సాయి చైతన్య సూచించారు. హెల్మెట్ లేని సమయంలో ప్రమాదం జరిగితే ప్రాణ నష్టం జరిగే అవకాశం ఉందని ఆయన అన్నారు. నిజామాబాద్ నగరంలో గల వెల్ నెస్ హాస్పిటల్స్ వారి సౌజన్యంతో 100 హెల్మెట్లను అందజేశారు. ఈ సందర్భంగా సీపీ చేతుల మీదుగాహాస్పిటల్ సిబ్బందికి, పోలీస్ సిబ్బంది, ఇతర వాహనదారులకు హెల్మెట్లను అందజేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి తమ వాహనాలను నడపాలని సూచించారు. ద్విచక్ర వాహన దారులు అనుకోని ప్రమాదానికి గురైనప్పుడు తమ ప్రాణాలను రక్షించుకోవడానికి అలాగే కుటుంబ సభ్యులను దృష్టిలో పెట్టుకొని తప్పనిసరిగా హెల్మెట్ ధరించిన తర్వాతనే తమ వాహనాలను నడపాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో వెల్ నెస్ హాస్పిటల్ యాజమాన్యం తాళ్ల సుమన్ గౌడ్, బొదు అశోక్ ల తో పాటు ట్రాఫిక్ ఏసిపి మస్తాన్ అలీ,ఇన్స్పెక్టర్ ప్రసాద్, ఆర్ఐ వినోద్,ఎస్ఐ వంశీకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.


తెలంగాణ సారస్వత పరిషత్తు
తిలక్ రోడ్, అబిడ్స్, హైదరాబాదు
ఆహ్వానం
ధర్మనిధి సాహితీ పురస్కారాల ప్రదానోత్సవం
2025

అధ్యక్షులు
ఆచార్య ఎల్లూరి శివారెడ్డి
అధ్యక్షులు, తెలంగాణ సారస్వత పరిషత్తు

ఆత్మీయ అతిథులు
డా. చింతపల్లి వసుంధరా రెడ్డి
తెలుగు జానపద సాహిత్య పరిషత్తు అధ్యక్షులు
ఆచార్య పి. సుమతీ నరేంద్ర
ప్రముఖ సాహితీవేత్త
శ్రీ బి.ఎస్. రాములు
బిసి కమిషన్ పూర్వాధ్యక్షులు, ప్రముఖ సాహితీవేత్త
ఆచార్య రావికంటి వసునందన్
ప్రముఖ సాహితీవేత్త
డా. పి. లక్ష్మీరెడ్డి
పూర్వ ఆచార్యులు,
నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ

గౌరవ అతిథి
శ్రీ రింగు రామమూర్తి
అసిస్టెంట్ డైరెక్టర్, విస్తరణ సేవా విభాగం,
సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం

ధర్మనిధి సాహితీ పురస్కార సమ్మాన్యులు

శ్రీమతి ఎర్రంరెడ్డి రంగనాయకమ్మ సాహితీ పురస్కారం
పురస్కార సమ్మాన్యులు : డా. రాయారావు సూర్యప్రకాశరావు
ఆలూరి బైరాగి సాహితీ పురస్కారం
పురస్కార సమ్మాన్యులు : శ్రీ వేముగంటి మురళీకృష్ణ
ఆచార్య పాకాల యశోదారెడ్డి సాహితీ పురస్కారం
పురస్కార సమ్మాన్యులు : డా. సంధ్యా విప్లవ్
డా. వానమామలై వరదాచార్య సాహితీ పురస్కారం
పురస్కార సమ్మాన్యులు : శ్రీ పెంగిలి సుదర్శన్‌రెడ్డి
డా. చింతపల్లి వసుంధరారెడ్డి జానపద విజ్ఞాన పురస్కారం
పురస్కార సమ్మాన్యులు : డా. సగిలి సుధారాణి
డా. బెజవాడ గోపాలరెడ్డి సాహితీ పురస్కారం
పురస్కార సమ్మాన్యులు : డా. తూర్పు మల్లారెడ్డి
డా. దివాకర్ల వేంకటావధాని సాహితీ పురస్కారం
పురస్కార సమ్మాన్యులు : డా. సాగి కమలాకర శర్మ
డా. రావికంటి వసునందన్ సాహితీ పురస్కారం
పురస్కార సమ్మాన్యులు : శ్రీ కందుకూరి అంజయ్య
విశాల సాహితీ బి.ఎస్.రాములు యువసాహిత్య పురస్కారం
పురస్కార సమ్మాన్యులు : శ్రీ మ్యాకం రవికుమార్

తేది : 2025 సెప్టెంబర్ 18, గురువారం సాయంత్రం 5.30 గంటలకు
వేదిక: డా. దేవులపల్లి రామానుజరావు కళామందిరం,
తెలంగాణ సారస్వత పరిషత్తు, తిలక్‌రోడ్, అబిడ్స్, హైదరాబాదు

కార్యక్రమానికి మిమ్మల్ని సాదరంగా ఆహ్వానిస్తున్నాం
డా. జె. చెన్నయ్య
ప్రధాన కార్యదర్శి, తెలంగాణ సారస్వత పరిషత్తు

# విశ్వకర్మ జయంతి : శ్రామికుల పర్వదినం

## (17 సెప్టెంబర్ "విశ్వకర్మ పూజ/జయంతి/దినోత్సవం" సందర్భంగా)

హిందూ సౌర మండల క్యాలెండర్ ప్రకారం, ప్రతి ఏట భాద్రపద మాసం చివరి రోజున విశ్వకర్మ దినోత్సవం లేదా కన్యా సంక్రాంతి (సూర్యుడు కన్య రాశిలోకి మారడం) పేర్లతో నిర్వహించుకుంటున్నాం. భారతదేశవ్యాప్తంగా 17 సెప్టెంబర్ 2025న రోజున విశ్వకర్మ పూజ నిర్వహించుకోవడం జరుగుతోంది. సృష్టికి, మౌళిక నిర్మాణాలకు దేవత అయిన విశ్వకర్మను అత్యంత భక్తి శ్రద్ధలతో పూజించుకునే పండుగ "విశ్వకర్మ పూజ", "విశ్వకర్మ జయంతి" లేదా "విశ్వకర్మ దినోత్సవం" అని తెలుసుకోవాలి. విశ్వం యొక్క తొలి ఇంజనీరు, వాస్తుశిల్పిగా విశ్వకర్మను గుర్తిస్తారు. ఇంజనీర్లు, పనిముట్లు తయారు చేసే కార్మికులు, ఆర్కిటెక్టులు, కళాకారులు, సాంకేతిక పనుల్లో నిమగ్నం అయిన ప్రజలు, ఆయుధాల తయారీదారులు, చేతివృత్తుల వారు, పరిశ్రమల్లో పని చేసే శ్రామికులు, యంత్రాలను నడిపే శ్రామికులు, మెకానిక్స్ లాంటి వర్గాలు ఈ పూజలను పవిత్రంగా జరుపుకుంటారు. సృష్టి కర్త, దైవిక వాస్తుశిల్పి అయిన విశ్వకర్మను గౌరవించడానికి ఈ పండుగను జరుపుకుంటున్నాం. కృష్ణుడు పాలించిన పవిత్ర ద్వారక నగరం, బంగారు ఆభరణాలు, దేవతలకు ఆయుధాలు, పుష్పక విమానాలు, విష్ణుమూర్తి సుదర్శన చక్రం, శివుడి త్రిశూలం, దైవిక రాజభవనాల సృష్టికర్తగా విశ్వకర్మకు పేరుంది. దేవతలకు కూడా ఆయుధాలను తయారు చేసి అందించిన వీరుడిగా భగవాన్ విశ్వకర్మకు ప్రత్యేక గుర్తింపు ఉన్నది.

### విశ్వకర్మ పూజ విధానం:

వాస్తుశిల్పం, యాంత్రిక శాస్త్రం, చేతివృత్తుల దేవత, నైపుణ్యాల చిరునామాగా విశ్వకర్మకు పేకు ఉన్నది. వడ్రంగులు, ఇంజనీర్లు, వాస్తుశిల్పులు, మెకానిక్స్ లాంటి వర్గాలు తమ పనిలో పురోగతిని కోరుకుంటూ విశ్వకర్మ పూజలను పవిత్ర భావనలతో జరుపుకుంటారు. ఈ రోజున తమ పని మెట్లను శుభ్రం చేసి, కార్య స్థలాలను శుద్ధి చేసి, పారిశ్రామిక ప్లాట్లు, యంత్రాలను పూజలతో అలంకరింపజేసి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఋ?గ్వేదంలో విశ్వకర్మ పాత్రను వివరంగా వర్ణించడా జరిగింది. పని ప్రదేశాలను శుభ్రపరచడం, బలిపీఠం, పూలు/ప్రసాదాలు సమర్పించడం, మంత్రాలు జపించడం, ధూపదీపాలు వెలిగించడం, సాధన పూజ చేయడం లాంటి పద్ధతులను అవలంభించి పూజలు నిర్వహిస్తారు.

మన ప్రపంచాణి నిర్మించి, నిర్వహించే వారి కృషి, సృజన, అంకితభావాలను ప్రస్తుతించాల్సిన సరైన సమయంగా విశ్వకర్మ పూజ సందర్భాన్ని తీసుకోవాలి.

చేతి వృత్తుల శ్రామికులకు పట్టం కట్టాల్సిన రోజుగా దీనికి ప్రాధాన్యం ఉన్నది. మన జీవితాలను సరళతరం చేస్తూ, మానవాళి సేవలో అవసర పనిముట్లను అందిస్తూ నాగరికత వికాసానికి తమదైన పాత్రను పోషిస్తున్న విశ్వకర్మ వారసులను అభినందిద్దాం, సృజనశీల విలక్షణ నైపుణ్య శ్రామిక శక్తి చేతులను సముచితంగా సన్మానించుకుందాం.

–డా॥బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700038

# చౌరబాటుదారులపై చర్యలు తప్పవు... త్వరలో దేశంలో సానుకూల ఫలితాలు

## –ఇది మోదీ ఇస్తున్న హామీ: ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 16:బీహార్ లోని పూర్ణియాలో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు దాదాపు రూ.40,000 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి, ప్రారంభించారు. సభను ఉద్దేశించి ప్రసంగించిన ప్రధానమంత్రి అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. పూర్ణియా ప్రాంతం మాతా పురాణ్ దేవి, భక్త ప్రహ్లాదుడు, మహర్షి మెహిబాబల పుణ్యభూమి అని వ్యాఖ్యానించారు. ఈ నేల ఫణీశ్వరనాథ్ రేణు, సతీనాథ్ బాధురి వంటి సాహిత్య దిగ్గజాలకు జన్మనిచ్చిందన్నారు. ఈ ప్రాంతాన్ని వినోబా భావే వంటి అంకితభావంతో పనిచేసిన కర్మయోగుల భూమిగా అభివర్ణించారు. ఈ భూమి పట్ల తనకున్న ప్రగాఢమైన భక్తిని ప్రధానమంత్రి పునరుద్ఘాటించారు.

బీహార్‌లో దాదాపు రూ. 40,000 కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవం చేసిన శ్రీ నరేంద్ర మోదీ.. రైల్వేలు, విమానాశ్రయాలు, విద్యుత్, నీటికి సంబంధించిన ఈ ప్రాజెక్టులు సీమాంచల్ ఆకాంక్షలను నెరవేర్చేందుకు ఉపయోగపడతాయని స్పష్టం చేశారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద 40,000 మందికి పైగా లబ్ధిదారులు పక్కా ఇళ్లు పొందారనీ, ఈ 40,000 కుటుంబాల జీవితాల్లో ఈ రోజు ఒక కొత్త శకం ఆరంభమవుతుందని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు. ధంతేరస్, దీపావళి, ఛఠ్ పూజలకు ముందు సొంత ఇంట్లోకి గృహప్రవేశం చేయడం గొప్ప అదృష్టమన్నారు. ఈ కుటుంబాలకు ఆయన అభినందనలు.. శుభాకాంక్షలూ తెలిపారు.

నిరాశ్రయులైన తన సోదరీసోదరులకు కూడా ఒక రోజు పక్కా ఇల్లు లభిస్తుందని భరోసా ఇవ్వడానికి ఈనాటి ఈ సందర్భం ఉపయోగపడుతుందన్నారు. గత 11 సంవత్సరాల్లో ప్రభుత్వం పేదలకు 4 కోట్లకు పైగా పక్కా ఇళ్లు నిర్మించి ఇచ్చిందనీ, ప్రభుత్వం ఇప్పుడు 3 కోట్ల కొత్త గృహాలను నిర్మించడానికి కృషి చేస్తోందన్నారు. ప్రతి పేద పౌరుడికీ పక్కా ఇల్లు లభించే వరకు మోదీ విశ్రమించడని భరోసా ఇచ్చారు. అణగారిన వర్గాలకు ప్రాధాన్యమివ్వడం, పేదలకు సేవ చేయడం తన పాలన ప్రధాన లక్ష్యమని శ్రీ నరేంద్ర మోదీ తెలిపారు.

ఈ రోజు ఇంజనీర్ల దినోత్సవమనీ, ఈ సందర్భంగా దేశమంతా సర్ ఎం. విశ్వేశ్వరయ్యకు నివాళులు అర్పిస్తోందన్నారు. అభివృద్ధి చెందిన భారత్.. అభివృద్ధి చెందిన బీహార్ నిర్మాణంలోనూ ఇంజనీర్ల పాత్ర కీలకమని తెలిపారు. దేశంలోని ఇంజనీర్లందరికీ ఆయన తన అభినందనలు.. శుభాకాంక్షలూ తెలిపారు. నేటి కార్యక్రమంలోనూ ఇంజనీర్ల అంకితభావం, నైపుణ్యం స్పష్టంగా కనిపిస్తోందనీ, పూర్ణియా విమానాశ్రయ టెర్మినల్ భవనం రికార్డు సమయంలో.. కేవలం అయిదు నెలల కన్నా తక్కువ సమయంలో నిర్మాణం పూర్తి చేసుకుందని తెలిపారు. టెర్మినల్ ప్రారంభోత్సవ అనంతరం ప్రధానమంత్రి మొదటి వాణిజ్య విమానాన్ని ప్రారంభించారు. ""కొత్త విమానాశ్రయం ప్రారంభంతో పూర్ణియా ఇప్పుడు దేశ విమానయాన పటంలో స్థానాన్ని సంపాదించింది" అని శ్రీ మోదీ ప్రకటించారు. పూర్ణియా-సీమాంచల్ మధ్య దేశవ్యాప్తంగా ఉన్న ప్రధాన నగరాలు, కీలక వాణిజ్య కేంద్రాలతో ప్రత్యక్ష అనుసంధానానికి ఇది వీలు కల్పిస్తుందని ఆయన వ్యాఖ్యానించారు.

"మా ప్రభుత్వం దేశంలోని అన్ని ప్రాంతాలను ఆధునిక, హైటెక్ రైలు సేవలతో అనుసంధానిస్తోంది" అని శ్రీ మోదీ ఉద్ఘాటించారు. ఒక వందే భారత్, రెండు అమృత్ భారత్, ఒక ప్యాసింజర్ రైలును ఆయన జెండా ఊపి ప్రారంభించారు. కొత్తగా అరారియా-గల్గాలియా రైలు మార్గాన్ని ప్రారంభిస్తున్నట్లు ప్రకటించిన ప్రధానమంత్రి.. విక్రమశిల-కటారియా రైలు మార్గానికి శంకుస్థాపన చేశారు.

బక్సర్-భాగల్పూర్ హై-స్పీడ్ కారిడార్‌లోని మోకామా-ముంగేరు సెక్షన్‌కు ఆమోదం తెలుపుతూ భారత ప్రభుత్వం ఇటీవల మరో కీలక నిర్ణయం తీసుకుందనీ, ఇది ముంగేరు, జమాల్‌పూర్, భాగల్పూర్ వంటి పారిశ్రామిక కేంద్రాలకు ఎంతో ప్రయోజనాన్ని చేకూరుస్తుందని ఆయన స్పష్టం చేశారు. భాగల్పూర్ - దుమ్కా-రాంపూర్‌హాట్ రైలు మార్గం డబ్లింగ్ పనులకూ ప్రభుత్వం ఆమోదం తెలిపిందన్నారు.

దేశాభివృద్ధి కోసం బీహార్ అభివృద్ధి చాలా అవసరమని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు. బీహార్ పురోగతికి పూర్ణియా, సీమాంచల్ ప్రాంతాల అభివృద్ధి చాలా కీలకమని, గత ప్రభుత్వాల దుష్పరిపాలన కారణంగా ఈ ప్రాంతం ఎంతో నష్టపోయిందని ప్రధానమంత్రి విమర్శించారు. తమ ప్రభుత్వం ఇప్పుడు ఈ పరిస్థితిని మారుస్తోందనీ, ఈ ప్రాంతం ఇప్పుడు అభివృద్ధి కేంద్రంగా ఉందని ప్రధానమంత్రి స్పష్టం చేశారు.

విద్యుత్ రంగంలో బీహార్ స్వయం-సమృద్ధి సాధించేలా ప్రయత్నాలు జరుగుతున్నాయనీ, భాగల్పూర్‌లోని పిర్‌పైంతిలో 2400 మెగావాట్ల థర్మల్ విద్యుత్ ప్రాజెక్టును ప్రారంభించామన్నారు. రైతులు, పశువుల పెంపకందారుల ఆదాయాన్ని పెంచడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కట్టుబడి ఉన్నాయని ఆయన స్పష్టం చేశారు. తూర్పు కోసి ప్రధాన కాలువను విస్తరించే కోసి-మెచి అంతర్-రాష్ట్ర నదుల అనుసంధాన ప్రాజెక్టు మొదటి దశకు శంకుస్థాపన చేస్తున్నట్లు శ్రీ మోదీ వెల్లడించారు. ఈ విస్తరణ లక్షల హెక్టార్లలో నీటిపారుదలని సులభతరం చేస్తుందనీ.. వరదల సవాళ్లను పరిష్కరించడంలోనూ సహాయపడుతుందని శ్రీ నరేంద్ర మోదీ తెలిపారు. బీహార్ రైతులకు మఖానా సాగు ప్రధాన ఆదాయ వనరుగా ఉందనీ.. గత ప్రభుత్వాలు ఈ పంటనూ, రైతులనూ నిర్లక్ష్యం చేశాయని ప్రధానమంత్రి విమర్శించారు. మఖానాకు తమ ప్రభుత్వం తగిన ప్రాధాన్యమిచ్చిందన్నారు.

"బీహార్ ప్రజలకు నేను ఇచ్చిన జాతీయ మఖానా బోర్డు హామీని సాకారం చేస్తూ.. కేంద్ర ప్రభుత్వం నిన్ననే బోర్డు ఏర్పాటు కోసం అధికారిక నోటిఫికేషన్ జారీ చేసింది" అని ప్రధానమంత్రి వెల్లడించారు. మఖానా రైతులకు మెరుగైన ధరలు లభించేలా చేయడం.. ఈ రంగంలో సాంకేతిక పరిజ్ఞాన వినియోగం మెరుగుపరచడం కోసం బోర్డు నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. మఖానా రంగం అభివృద్ధి కోసం ప్రభుత్వం దాదాపు రూ. 475 కోట్ల విలువైన ప్రణాళికకు ఆమోదం తెలిపిందన్నారు.

బీహార్ ప్రస్తుత అభివృద్ధి, పురోగతి వేగం కొంతమందికి ఆందోళన కలిగిస్తోందనీ, దశాబ్దాలుగా బీహార్‌ను దోచుకుని, ఈ నేలను మోసం చేసిన వారు ఇప్పుడు బీహార్ నరికొత్త ప్రమాణాలను నిర్దేశించగలదని అంగీకరించేందుకు ఇష్టపడటం లేదన్నారు. బీహార్‌లోని ప్రతి రంగంలో వేల కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులు సాకారమవుతున్నాయనీ, రాజ్‌గిర్‌లో హాకీ ఆసియా కప్ నిర్వహణ.. ఆంటా-సిమారియా వంతెన చరిత్రాత్మక నిర్మాణం.. మేడ్-ఇన్-బిహార్ రైలు ఇంజిన్‌లను ఆఫ్రికాకు ఎగుమతి చేయడం వంటి కీలక విజయాలను ఆయన ఉటంకించారు. ఈ విజయాలను ప్రతిపక్ష నాయకులు జీర్ణించుకోవడం కష్టమనీ, బీహార్ ముందుకు వచ్చినప్పుడల్లా.. ప్రతిపక్ష పార్టీలు రాష్ట్రాన్ని అవమానించడానికి ప్రయత్నిస్తాయన్నారు. ప్రతిపక్ష పార్టీల్లో ఒకరు బీహార్‌ను సోషల్ మీడియాలో బీడీతో పోల్చిన ఇటీవలి సందర్భాన్ని ప్రస్తావించిన శ్రీ నరేంద్ర మోదీ.. ఇది ధిక్కారాన్ని ప్రతిబింబిస్తుందన్నారు. ఈ పార్టీలు మోసాలు, అవినీతి ద్వారా బీహార్ ప్రతిష్ఠను దెబ్బతీస్తున్నాయనీ.. ఇప్పుడు రాష్ట్రం అభివృద్ధి చెందుతున్న సమయంలో మళ్లీ ప్రతిష్ఠను దెబ్బతియ్యడానికి ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. అటువంటి మనస్తత్వం ఉన్న వ్యక్తులు బీహార్ సంక్షేమం కోసం ఎప్పటికీ పనిచేయలేరని, సొంత ఖజానాను నింపుకోవడానికి మాత్రమే శ్రద్ధ చూపే వారు.. పేదల ఇళ్లను గురించి పట్టించుకోరన్నారు. వారి హయాంలో ప్రభుత్వం పంపిన ప్రతి రూపాయిలో 85 పైసలు అవినీతికి గురైనట్లు మాజీ ప్రధానమంత్రి అంగీకరించారని గుర్తు చేశారు. ఆ పార్టీల పాలనలో డబ్బు ఎప్పుడైనా పేదలకు నేరుగా చేరిందా అని ప్రశ్నించారు. కోవిడ్-19 మహమ్మారి నుంచి ప్రతి పేద కుటుంబం ఉచిత రేషన్ పొందుతోం దని శ్రీ మోదీ తెలిపారు. అటువంటి పార్టీల ప్రభుత్వాల హయాంలో ఇలాంటి ప్రయోజనాలు ఎప్పుడైనా అందించారా అని ప్రశ్నించారు. ఆయుష్మాన్ భారత్ పథకం కింద పేదలందరికీ ఇప్పుడు రూ. 5 లక్షల వరకు ఉచిత వైద్య చికిత్స అందుబాటులో ఉందని ప్రధానమంత్రి తెలిపారు. ఆసుపత్రులను నిర్మించడంలో విఫలమైన వారు ఇలాంటి ఆరోగ్య సంరక్షణ ప్రయోజనాలను ఎలా అందించగలరని శ్రీ మోదీ ప్రశ్నించారు.

ప్రతిపక్ష పార్టీలు బీహార్ గౌరవానికే కాకుండా దాని గుర్తింపుకు కూడా ముప్పు కలిగిస్తున్నాయని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అన్నారు. అక్రమ చొరబాటుదారుల కారణంగా సీమాంచల్, భారతదేశ తూర్పు భాగంలో తలెత్తుతున్న తీవ్రమైన జనాభా సంక్షోభాన్ని ఆయన ప్రస్తావించారు. బీహార్, బెంగాల్, అస్సాంలోని ప్రజలు సోదరీమణులు, ఆడబిడ్డల భద్రత గురించి ఎక్కువగా ఆందోళన చెందుతున్నారని విచారం వ్యక్తం చేశారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు ఎర్రకోట నుంచి జనాభా మిషన్‌ను ప్రకటించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం చొరబాటుదారులను రక్షించే ప్రయత్నం చేస్తోన్న ప్రతిపక్ష కూటమి, దాని అనుబంధ వ్యవస్థను ఆయన విమర్శించారు. వీళ్లు బీహార్‌తో పాటు భారతదేశ వనరులు, భద్రత రెండింటినీ ప్రమాదంలో పడేయడానికి సిద్ధంగా ఉన్నారని ఆరోపించారు. ప్రతి చొరబాటుదారుడిని ఇక్కడ నుంచి పంపించనున్నట్లు పూర్ణియా సభా వేదిక నుంచి ప్రకటించారు. చొరబాట్లను ఆపేయటం తమ ప్రభుత్వం తీసుకున్న బాధ్యత అని ఆయన తెలిపారు. చొరబాటు దారులను రక్షించే నాయకులు ముందుకు రావాలని ఆయన సవాలు చేశారు. ఈ నాయకులు చొరబాటు దారులను రక్షించేందుకు ఎంత ప్రయత్నించినా ప్రభుత్వం మాత్రం దృఢ సంకల్పంతో పనిచేస్తుందనీ, చొరబాటుదారులకు రక్షణ కవచంగా వ్యవహరించే వారిని ఆయన హెచ్చరించారు. అక్రమంగా ప్రవేశించేవారి ఇష్టాయిష్టాలు కాకుండా భారత చట్టాలదే పైచేయి అవుతుందని ఆయన స్పష్టం చేశారు. చొరబాటుదారులపై చర్యలు తీసుకుంటామనీ, వీటి ఫలితాలను దేశం త్వరలోనే చూస్తుందని ఉద్ఘాటించారు. చొరబాటుదారులకు మద్దతునిస్తూ చేసే భావజాల వ్యాప్తిని ప్రతిపక్ష కూటమి ప్రోత్సహిస్తోందనీ, వాళ్లకు బలమైన నిర్ణయాత్మక గుణపాఠం చెప్పేందుకు బీహార్, భారతదేశ ప్రజలు సిద్ధమవుతున్నారని వ్యాఖ్యానించారు.

గత రెండు దశాబ్దాలుగా బీహార్‌లోని ప్రతిపక్ష పార్టీ అధికారంలోకి రాలేదనీ, దీని వెనుక చోదక శక్తి బీహార్ మహిళలు, తల్లులు, మహిళలేనని ప్రధాని పేర్కొన్నారు. ప్రతిపక్ష పార్టీలు పరిపాలిం చినప్పుడు.. హత్య, అత్యాచారం, దోపిడీ వంటి తదితర నేరాలకు మహిళలే ప్రాథమిక బాధితులుగా ఉన్నారన్నారు. కేంద్ర, రాష్ట్రాల్లోని తమ ప్రభుత్వం వల్ల ఈ మహిళలు ఇప్పుడు 'లఖ్‌పతి దీదీలు', 'డ్రోన్ దీదీలు'గా తయారవుతున్నారని.. స్వయం సహాయక బృందాల ద్వారా వస్తోన్న ఈ పరివర్తనకు మహిళామణులే నాయకత్వం వహిస్తున్నాయని చెప్పా రు. ముఖ్యమంత్రి శ్రీ నితీష్ కుమార్ నాయకత్వంలో చేపట్టిన జీవికా దీదీ కార్యక్రమం ఘన విజయం సాధించి నందుకు ఆయన ప్రశంసించారు. మహిళల కోసం దాదాపు రూ. 500 కోట్ల సామాజిక పెట్టుబడి నిధిని (కమ్యూనిటీ ఇన్వెస్ట్‌మెంట్ నిధి) విడుదల చేసినట్లు ప్రధానమంత్రి ప్రకటించారు. ఈ మొత్తం క్లస్టర్ స్థాయి సమాఖ్యలకు అందుతుందని.. తద్వారా గ్రామాల్లోని స్వయం సహాయక బృందాలు సాధికారత పొందుతాయని వివరించారు.

మహిళలు వారి సామర్థ్యాలను పెంపొందించుకోవటానికి, ఆర్థిక పరిస్థితిని మెరుగుపరుచుకునేందుకు ఈ కార్యక్రమం కొత్త అవకాశాలను అందిస్తుందని చెప్పారు.

ప్రతిపక్షాలకు సొంత కుటుంబాల క్షేమమే మొదటి ప్రాధాన్యతని, వారు ఎప్పుడూ ప్రజల కుటుంబాలను పట్టించుకోలేదని మోదీ విమర్శించారు. దేశంలోని ప్రతి ఒక్కరు తన కుటుంబంలో భాగమని ఆయన ప్రముఖంగా చెప్పారు. అందుకే ప్రజల ఖర్చులు, వారి పొదుపుల గురించి ఆందోళన చెందుతున్నట్లు తెలిపారు. దీపావళి, ఛత్ సహా అనేక పండుగలు వస్తున్నందున ప్రభుత్వం నుంచి పేదలు, మధ్యతరగతికి ప్రభుత్వం ఒక మంచి బహుమతిని ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఇవాళ సెప్టెంబర్ 15 అని, సరిగ్గా ఒక వారం తరువాత నవరాత్రి ప్రారంభమవుతుందని, ఆ రోజు సెప్టెంబర్ 22న దేశవ్యాప్తంగా జీఎస్టీ తగ్గుతుందని తెలిపారు. రోజువారీగా ఉపయోగించే చాలా వస్తువులపై జీఎస్టీ గణనీయంగా తగ్గుతుందని తెలియజేశారు. కార్యక్రమానికి హాజరైన మహిళలను ఉద్దేశించి మాట్లాడుతూ.. జీఎస్టీ తగ్గింపు వల్ల వంటగదికి సంబంధించిన ఖర్చులు కూడా బాగా తగ్గుతాయన్నారు. టూత్‌పేస్ట్, సబ్బు, షాంపూ, నెయ్యి, వివిధ ఆహార ఉత్పత్తులు వంటివి మరింత అందుబాటు ధరల్లోకి వస్తాయి. పిల్లల విద్యకు సంబంధించిన స్టేషనరీ ఖర్చు కూడా తగ్గుతుందని అన్నారు. ఈ పండుగ సీజన్‌లో పిల్లలకు సంబంధించిన కొత్త బట్టలు, బూట్లు చౌకగా మారుతాయని.. తద్వారా వాటిని కొనటంలో భారం తగ్గుతుందన్నారు. ప్రభుత్వం పేదల పట్ల నిజంగా నిబద్ధతతో నడుచుకున్నప్పుడు ఇటువంటి ప్రభావవంతమైన పురోగతిని ప్రజలకు అందుతుందని ప్రముఖంగా చెప్పారు.

పూర్ణియా వీరులు స్వాతంత్ర్య పోరాటంలో భారతదేశ సామర్థ్యాన్ని బ్రిటిష్ వారికి తెలియజేశారని గుర్తు చేసిన ఆయన.. ఆపరేషన్ సిందూర్ ద్వారా భారత్ మరోసారి తన ప్రత్యర్థులకు అదే సామర్థ్యాన్ని చూపిందన్నారు. ఈ వ్యూహాత్మక దాడిని చేపట్టటంలో పూర్ణియాకు చెందిన ధీరులు పోషించిన కీలక పాత్రను ప్రముఖంగా ప్రస్తావించారు. జాతీయ భద్రత అయినా, జాతీయాభివృద్ధి అయినా.. దేశ పురోగతిలో బీహార్ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. బీహార్ అభివృద్ధి పూర్తి సామర్థ్యంతో కొనసాగాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో బీహార్ గవర్నర్ శ్రీ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్, బీహార్ ముఖ్యమంత్రి శ్రీ నితీష్ కుమార్.. కేంద్ర మంత్రులు శ్రీ రామ్మోహన్ నాయుడు, శ్రీ రాజీవ్ రంజన్ సింగ్, శ్రీ జితన్ రామ్ మాంజీ, శ్రీ గిరిరాజ్ సింగ్, శ్రీ చిరాగ్ పాశ్వాన్, శ్రీ నిత్యానంద రాయ్, శ్రీ రామ్ నాథ్ ఠాకూర్, డాక్టర్ శ్రీ రాజ్ భూషణ్ చౌదరి, శ్రీ సతీష్ చంద్ర దూబే తదితరులు పాల్గొన్నారు.

ప్రధానమంత్రి బీహార్‌లో జాతీయ మఖానా బోర్డును ప్రారంభించారు. మఖానా ఉత్పత్తి, కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేయటాన్ని ఈ బోర్డు ప్రోత్సహించనుంది. పంటకోత తర్వాత దిగుబడుల నిర్వహణను కూడా బలోపేతం చేయటంతో పాటుగా విలువ జోడింపు, ప్రాసెసింగ్‌ను ప్రోత్సహించనుంది. మఖానాకు సంబంధించిన మార్కెట్, ఎగుమతి, బ్రాండ్ అభివృద్ధిని సులభతరం చేయనుంది. మొత్తంగా బీహార్, దేశంలోని మఖానా రైతులకు ప్రయోజనం చేకూర్చనుంది. దేశంలోని మఖానా ఉత్పత్తిలో 90 శాతం బీహార్‌లోనే జరుగుతోంది. ఈ పంటకు మధుబని, దర్భాంగా, సీతామర్హి, సహర్సా, కతిహార్, పూర్ణియా, సుపాల్, కిషన్‌గంజ్, అరారియాలలో అనుకూలమైన వాతావరణ పరిస్థితులు ఉన్నాయి. నాణ్యమైన మఖానా సాగుకు దోహదపడే సారవంతమైన నేలలు ఇవి కలిగి ఉన్నాయి. ఈ కారణాలతోనే ఈ జిల్లాలు మఖానా ఉత్పత్తికి ప్రధానమైన కేంద్రాలుగా ఉన్నాయి. బీహార్‌లో మఖానా బోర్డు ఏర్పాటు చేయటం వల్ల రాష్ట్రం, దేశంలో మఖానా ఉత్పత్తికి మంచి ప్రోత్సాహం లభిస్తుంది. ఇది మఖానా ఉత్పత్తికి సంబంధించిన ప్రపంచ పటంలో బీహార్ స్థానాన్ని బలోపేతం చేస్తుంది.

పూర్ణియా విమానాశ్రయంలోని కొత్త పౌర ఎన్‌క్లేవ్‌లో తాత్కాలిక టెర్మినల్ భవనాన్ని ప్రధానమంత్రి ప్రారంభించారు. ఇది ప్రయాణికుల నిర్వహణ సామర్థ్యాన్ని పెంచుతుంది.

పూర్ణియాలో దాదాపు రూ. 40,000 కోట్ల విలువైన బహుళ అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రధానమంత్రి ప్రారంభోత్సవం, శంకుస్థాపన చేశారు.

భాగల్పూర్‌లోని పిర్‌పైంతిలో 3x800 మెగావాట్ల థర్మల్ విద్యుతుత్పత్తి కేంద్రానికి ప్రధానమంత్రి శంకుస్థాపన చేశారు. రూ. 25,000 కోట్ల విలువైన ఈ ప్రాజెక్టు బీహార్ ప్రైవేటు రంగంలో అతిపెద్ద పెట్టుబడిగా ఉంది. ఈ కేంద్రాన్ని అల్ట్రా-సూపర్ క్రిటికల్, తక్కువ ఉద్గారాలు ఉండే సాంకేతికత ఆధారంగా నిర్మించనున్నారు. బీహార్‌కు కూడా విద్యుత్తు అందించే ఈ ప్రాజెక్టు.. రాష్ట్ర ఇంధన భద్రతను బలోపేతం చేస్తుంది.

రూ. 2680 కోట్లకు పైగా విలువైన కోసి-మెచి నది అనుసంధాన ప్రాజెక్టు మొదటి దశకు ప్రధానమంత్రి శంకుస్థాపన చేశారు. కాలువలను ఆధునికీకరించటం, సిల్టింగ్, దెబ్బతిన్న వాటి పునర్నిర్మాణం, సెట్లింగ్ బేసిన్ పునరుద్ధరణ పనులతో పాటు కాలువ సామర్థ్యాన్ని 15,000 క్యూసెక్కుల నుంచి 20,000 క్యూసెక్కులకు పెంచే పనులు ఇందులో భాగంగా చేపట్టనున్నారు. ఇది ఈశాన్య బీహార్‌లోని అనేక జిల్లాలకు నీటిపారుదల, వరద నియంత్రణ, వ్యవసాయ దృఢత్వంలో ప్రయోజనం చేకూరుస్తుంది.

రైలు కనెక్టివిటీని మెరుగుపరచాలన్న నిబద్ధతకు అనుగుణంగా ప్రధానమంత్రి బీహార్‌లో పలు రైల్వే ప్రాజెక్టుల ప్రారంభోత్సవం, శంకుస్థాపన చేయటంతో పాటు కొన్ని రైళ్లను ప్రారంభించారు.

గంగా నదిని దాటేందుకు ప్రత్యక్ష రైల్వే అనుసంధానతను అందించే రూ. 2,170 కోట్లకు పైగా విలువైన విక్రమ్‌శిల - కటారియా మార్గానికి ప్రధానమంత్రి శంకుస్థాపన చేశారు. గంగా నదిపై ప్రత్యక్ష రైలు అనుసంధానతను అందించటం ద్వారా ఇది ఈ ప్రాంత ప్రజలకు గణనీయంగా ప్రయోజనం చేకూరు స్తుంది.

4,410 కోట్ల ఖర్చుచేపట్టిన అరరియా - గల్గాలియా (ఠాకూర్ గంజ్) మధ్య నూతన రైలు మార్గాన్ని ప్రధానమంత్రి ప్రారంభించారు.

అరారియా - గల్గాలియా (ఠాకూర్‌గంజ్) మార్గంలో రైలును ప్రధాని ప్రారంభించారు. రెండు జిల్లాల మధ్య వచ్చిన ప్రత్యక్ష రైలు అనుసంధానత ఈశాన్య బీహార్ అంతటా రవాణాను మెరుగుపరచనుంది. జోగ్బానీ- దానాపూర్ మధ్య వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలును కూడా ఆయన ప్రారంభించారు. ఇది అరారియా, పూర్ణియా, మాధేపురా, సహర్సా, ఖగారియా, బెగుసరాయ్, సమస్తిపూర్, ముజఫర్‌పూర్, వైశాలి, పాట్నా వంటి జిల్లాలకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూరుస్తుంది. సహర్సా - ఛెహర్తా (అమృత్‌సర్)- జోగ్బానీ- ఈరోడ్ మధ్య అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైలును కూడా ఆయన ప్రారంభిం చారు. ఆధునిక ఇంటీరియర్స్, మెరుగైన సౌకర్యాలతో ఉన్న ఈ రైలు వేగవంతమైన ప్రయాణాన్ని అందిస్తుంది. అదే సమయంలో ఈ ప్రాంతాలలో ఆర్థిక, సాంస్కృతిక, సామాజిక ఏకీకరణను ప్రోత్సహిస్తుంది.

ప్రధానమంత్రి పూర్ణియలో లింగ విభజన వీర్య కేంద్రాన్ని ప్రారంభించారు. రాష్ట్రీయ గోకుల్ మిషన్ కింద ఏర్పాటు చేసిన ఈ కేంద్రం ఏటా లింగ విభజన చేసిన 5 లక్షల వీర్యం డోసులను ఉత్పత్తి చేయగలదు. తూర్పు, ఈశాన్య భారత్‌లో ఈ తరహా కేంద్రాల్లో మొదటిది ఇదే. భారత్‌లో తయారీ, ఆత్మనిర్భర్ భారత్ దార్శనికతకు అనుగుణంగా 2024 అక్టోబర్‌లో ఆవిష్కరించిన స్వదేశీ సాంకేతికతను ఈ కేంద్రం ఉపయోగిస్తుంది.

# సోలార్ కార్మికులకు సింగరేణి యాజమాన్యం న్యాయం చేయాలి

**- 3నెలలు ఉపాధి లేక 30కుటుంబాలు రోడ్డుపైకి, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి**
**- తక్షణం ఉద్యోగాల్లో తీసుకోవాలి సోలార్ యాజమాన్యం, సింగరేణిని ఇఫ్టు అఖిల భారత కార్మిక సంఘం**
**- ఇఫ్టు ఖమ్మం జిల్లా నాయకులు భూక్య శివ నాయక్ డిమాండ్**



ఖమ్మం, సెప్టెంబర్ 16:(నేటినిజం ప్రతినిధి): కారేపల్లి మండల కేంద్రంలో గల ఉ సిరికాయలపల్లి పరిధిలోని సోలార్ కార్మికులు గత కొన్ని సంవత్సరాల నుండి ఉద్యోగం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు.

అయితే ఆ సోలార్ సింగరేణి యాజమాన్యం 30మంది కార్మికులు గత మూడు నెలల నుండి సింగరేణి యాజమాన్యం పనిలో తీసుకుపోలేదు అటు కుటుంబాలు రోడ్డుపైకి వచ్చినవి ఉపాధి లేక కుటుంబం గడపడం చాలా ఇబ్బంది తరహాగా మారింది. 300ఎకరాల్లో భూమి విస్తీర్ణంలో ఉన్న సోలార్ ప్లాంట్లో 9మంది సెక్యూరిటీలతో పని చేయిస్తున్నారు. కానీ 70మందితో అవసరం ఉన్నప్పటికీ సోలార్ యాజమాన్యం సింగరేణి యాజమాన్యం కలిసి 30మందితో సరిదిద్దుతున్నారు. సోలార్ ప్లాంట్లో అన్ని శాఖలో పనిచేస్తున్న కార్మికులతో రాత్రిపూట సెక్యూరిటీ డ్యూటీ పనిచేయాలని సింగరేణి ఏరియా ఇంజనీరింగ్ వీరునాయక్ బిహెచ్ ఈఎల్ యాజమాన్యం కార్మికులకు ఇబ్బందులకు గురి చేస్తున్నది, కార్మికులపై కుట్ర పన్నుతున్న యాజమాన్యం అవలంబిస్తున్న వేతనాన్ని తక్షణమే ఉపసంహరించుకొని కార్మికులందరినీ ఉద్యోగాల్లో తీసుకోవాలని ఐఎఫ్టియు ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో శ్యాం బాబు, ప్రేమ్ సింగ్, సంజీవ్ కుమార్, రాజ్ కుమార్, బాలు, శంకర్, చిన్న శ్రీను, సైదులు, కళ్యాణ్, చిరంజీవి, రామకృష్ణ, చందర్, హమీద్, తదితరులున్నారు.

# పొరపాట్లు జరగకూడదు

## –ఉల్లి ఎన్యూమరేషన్ పై కర్నూలు కలెక్టర్ డాక్టర్ .ఏ.సిరి

అమరావతి, సెప్టెంబర్ 16:ముందస్తు ఖరీఫ్ సీజన్‌లో వర్షాలతో దెబ్బ తిన్నఉల్లి పంటను ఎన్యూమరేషన్ చేయాలని కర్నూలు జిల్లా కలెక్టర్ డాక్టర్. ఏ.సిరిఅధికారులను ఆదేశించారు.

మంగళవారం ఉదయం ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, వ్యవసాయ అధికారులు, మండల స్పెషల్ అధికారులతో విజయవాడ నుంచి కలెక్టర్ సిరి టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్యూమరేషన్ లో ఎలాంటి ఫిర్యాదులు రాకుండా ఎన్యూమరేషన్ ను జాగ్రత్తగా చేయాలన్నారు.

మీరు పంపిన డేటాను వర్షపాత నివేదికతో కో రిలేట్ చేసుకొని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామని కలెక్టర్ తెలిపారు. ఉల్లి పంటపక్వానికి రాక ముందే కోయకుండా, 110 రోజుల తర్వాత కోసి, తదుపరి బాగా ఆరబెట్టి, గ్రేడింగ్ చేసుకుని రైతుకు మార్కెట్‌కు తీసుకొని వచ్చేవిధంగా గ్రామ హార్టికల్చర్‌అధికారి, గ్రామ వ్యవసాయ అధికారులు రైతులకు అవగాహన కల్పించాలన్నారు.

110 రోజులు పంటను పండించకుండా, క్యూరింగ్ చేయకుండా రైతులు ఉల్లి పంటను మార్కెట్ కి తీసుకొని వస్తున్నారని, తద్వారా మంచి ధర రైతులకు రావడం లేదని కలెక్టర్ పేర్కొన్నారు. టమోట పైన నల్ల నల్లగా మచ్చలు వస్తున్నాయని, టమోటాకు మంచి ధర రావడం లేదని ప్రతికూల వార్తలు వస్తున్నాయన్నారు.

మొక్కల సంరక్షణ చర్యలలో భాగంగా టమోట పంట బాగా వచ్చే విధంగా చర్యలు తీసుకోవడంతో పాటు, టమోటకి మంచి ధర వచ్చేవిధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జిల్లా హార్టికల్చర్ అధికారిని ఆదేశించారు. ఉల్లి పంట క్రాప్ బుకింగ్ శనివారం లోపు పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య మాట్లాడుతూ ఉల్లి పంట ఈ క్రాప్ బుకింగ్ 100 శాతం పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు.

టెలి కాన్ఫరెన్స్ లో టీఆర్ ఓ సీ.వెంకట నారాయణమ్మ, జిల్లా పరిషత్ సీఈఓ నాసర రెడ్డి, హార్టికల్చర్ అధికారి రామాంజనేయులు పాల్గొన్నారు.

# ఓజోన్ పొర పలుచబడితే ప్రాణికోటి మనుగడ ప్రశ్నార్థకమే

## - లయన్: కెప్టెన్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి, విశ్రాంత ప్రిన్సిపల్




హైదరాబాద్, సెప్టెంబర్ 16:ఆకాశంలోని స్ట్రాటోవరణంలో సహజ సిద్ధంగా ఏర్పజిన ఓజోన్ పొర సూర్యరశ్మిలోని ప్రమాదకర అతినీలలోహిత కిరణాలను శోషణం చేసుకొని సాధారణ సూర్యకాంతిని నేలపైకి వచ్చినట్లు చేసే బృహత్ కార్యక్రమాన్ని చేయడంతో జీవకోటి ఆరోగ్యకర మనుగడ సాధ్యమవుతున్నదని ప్రముఖ రచయిత విశ్రాంత ప్రిన్సిపాల్ లయన్ డాక్టర్ కెప్టెన్ బుర్ర మధుసూదన్ రెడ్డి అన్నారు. ఈ రోజు కమాన్ వద్దగల గాయత్రి హైస్కూల్ విద్యార్థులతో శాతవాహన లయన్స్ క్లబ్, లీడ్ ఇండియా నేషనల్ క్లబ్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన ప్రపంచ ఓజోన్ దినం సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన మాట్లాడుతూ మానవ ప్రేరేపిత కార్యక్రమాల వల్ల క్రమంగా ఓజోన్ పొర పలుచబడుతోందని, ఇలాగే కొనసాగితే ఓజోన్ పొరకు రంధ్రాలు ఏర్పడి అత్యంత ప్రమాదకరమైన అతినీలలోహిత కిరణాలు నేలపైకి చేరి ప్రాణికోటి ఆరోగ్యాన్ని నాశనం చేయడమ ఖాయమని హెచ్చరించారు. ఆధునికత పేరుతో నవ్య మానవుడు చేస్తున్న సాహసాల వల్ల ఓజోన్ పొరకు హాని కలుగుతోందని, ఇప్పటికైనా ఆ పొరను పరిరక్షించుకొనుటకు ప్రతి ఒక్కరు పూనుకోవాలని పిలుపునిచ్చారు. విద్యార్థి దశలోనే నిర్దిష్టమైన లక్ష్యాలను ఏర్పరచుకొని వాటి సాధనకు క్రమశిక్షణతో కూడిన కృషిని కొనసాగించాలనే అన్నారు. లయన్ గాండ్ల చంద్రశేఖర్, క్లబ్ కార్యదర్శి వాదన సమర్పన చేసి మాట్లాడుతూ క్రమశిక్షణ, అంకితభావంతో కూడిన యువతకు బంగారు భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. గాయత్రి హైస్కూల్ చైర్మన్ శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో లయన్ పచ్చునూరి సురెందర్, కోశాధికారి, లయన్ కోట సత్యం, పాఠశాల విద్యార్థి టనీవిద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

# అఖిలపక్ష నాయకుల సమక్షంలో 10వార్డులు విస్తృత ర్యాలీ



ఖమ్మం, సెప్టెంబర్ 16:(నేట నిజం ప్రతినిధి): సింగరేణి మండలం ఉసిరికాయలపల్లి గ్రామపంచాయతీలో అఖిలపక్ష నాయకుల సమక్షంలో ఉసిరికాయలపల్లి, నడుమూరు, అలియా తండా పంచాయతీలో గల పది వార్డులలో విస్తృత ర్యాలీలో భాగంగా అఖిలపక్ష నాయకులు, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకుంటూ అస్తవ్యస్తంగా మారిన వీధులు బురదమయంగా మారిన రోడ్లను పరిశీలిస్తూ చెత్త చెదారాలతో నిండిన డ్రైనేజీలను, సైడ్ కాలువలలో పేరుకుపోయిన మట్టిని తొలగించాలని రోడ్లపై ఇష్టానుసారంగా ఇందిరమ్మ ఇండ్ల పేరుతో డ్రైనేజీలపై ఇసుక, మొరం, ఇటుకలను పోస్తూ రహదారులకు ఇబ్బందికరంగా మారిన వీధులను పరిశీలిస్తూ వాహనదారులకు, ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ఇబ్బంది లేని చోట పోయించుకునేలా వివరిస్తూ దసరా ఉత్సవాల సందర్భంగా కోట మైసమ్మ తల్లి ఆర్చి దగ్గర నుండి సీతారాం పురం వరకు ఎండోమెంట్ అధికారు లు సీసీ కెమెరాలు, వీధిలైట్లు ఏర్పాటు చేయాలని, ముల్ల కంపలను తొల గించాలని, రోడ్లకు ఇరు ప్రక్కలకు మొరం మరమ్మతులు జరిపించాలని ఎండోమెంట్ వారి దృష్టికి తీసుకువెళ్లాలని సెక్రెటరీ నిరంజన్ కి వివరించడం జరిగింది, అదేవిధంగా గ్రామంలో మెయిన్ సెంటర్లలో ఎనిమిది చేతిపంపులను రిపేర్ చేయించాలని, తాగునీటికి ఇబ్బంది లేకుండా చూడాలని, దోమల మందు, కలుపు మందు, బ్లీచింగ్ చల్లించడం, గ్రామపంచాయతీలో గతంలో లాగా వారానికి మూడు రోజులలో చెత్త ట్రాక్టర్లను యధావిధి గా నడిపించాలని, బురదమయంగా గుంటలు గుంటలుగా మారిన స్మశాన వాటికకు వెళ్లే దారికి మరమ్మతులు జరిపించాలని, గ్రామపంచాయతీ కార్యదర్శి నిరంజన్ పై అధికారుల దృష్టికి తీసుకువెళ్లాల్లి గ్రామాన్ని అభివృద్ధి మార్గంలో నడిపించాలని వినతి పత్రం అందించడం జరిగింది. ఈ కార్యక్రమం లో మాజీ సర్పంచ్ భానోత్ బన్సీలాల్, బిఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షులు జాల సాంబ, గొర్రెల, మేకల పెంపకదారుల సంఘం జిల్లా నాయకులు దాసరి మల్లయ్య, మండల బిఆర్ఎస్ నాయకులు బోడ హీరో లాల్, పృధ్వి, దాసరి సైదులు, చందర్, పచ్చిపాల తిరుపతయ్య, బాలు, బ్రహ్మం, తదితరులు పాల్గొన్నారు.

# నయా దోపిడిపై పోరాటానికి ప్రజలు సిద్ధం కావాలి

## –జమ్ముల జితేందర్ రెడ్డి

ఖమ్మం, సెప్టెంబర్ 16: నైజాం నిరంకుశ పాలన అంతం కోసం సాగిన తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తిగా కేంద్ర, రాష్ట్ర నయా దోపిడికి వ్యతిరేకంగా ప్రజలు పోరాటానికి సిద్ధం కావాలని సిపిఐ ఖమ్మం జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బెజవాడ రవిబాబు పిలుపునిచ్చారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాల్లో భాగంగా మంగళ వారం మధిర పట్టణంలోని తెలంగాణ సాయుధ పోరాట యోధుడు వాసిరెడ్డి వెంకటపతి స్మారక స్థూపానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఊట్ల కొండలరావు అధ్యక్షతన జరిగిన సభలో వారు మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం స్వాతంత్ర్య భారత చరిత్రలో అపూర్వమైన అధ్యాయం అన్నారు. జమిందారీ వ్యవస్థ కూల్చివేత కోసం ప్రాణాలను పణంగా పెట్టి పోరాడిన పోరాటయోధుల త్యాగాలు శాశ్వత స్ఫూర్తిగా నిలుస్తాయన్నారు. ఆ కాలంలో కమ్యూనిస్టు పార్టీ పిలుపుతో వేలాది మంది రైతులు, కూలీలు, గిరిజనులు చేతిలో తుపాకీ, కొడవల్లు విల్లు, బాణాలు పట్టుకుని జమిందారుల దోపిడీని ఎదిరించారని గుర్తుచేశారు.

ఈ పోరాటం వల్లే వేలాది ఎకరాల భూమి పేదలకు పంచబడిందని, పల్లెల్లో గణనీయమైన సామాజిక మార్పులు చోటుచేసుకున్నట్లు తెలిపారు. రాచరికానికి, నిర్బంధానికి వ్యతిరేకంగా జరిగిన పోరాటాన్ని బీజేపీ, ఎంఐఎం పరస్పరం పబ్బం గడుపుకునే ప్రయత్నాలు చేస్తున్నాయని, కమ్యూనిస్టులు చేపట్టిన వీరోచిత పోరాటాలను తట్టుకోలేకనే నైజాం రాజు హైదరాబాద్ సంస్థానాన్ని భారతదేశంలో విలీనం చేసిన సుదినం సెప్టెంబర్ 17 అని పేర్కొన్నారు. సాయుధ పోరాట అమరులు ఆశించిన లక్ష్యాల సాధన దిశగా పోరాటాలు ముమ్మరం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తాటి వెంకటేశ్వరరావు, ఏనుగు గాంధీ, ఏనుగు వెంకటేశ్వం రావు, ఎంఏ రహీం, సిపిఐ జిల్లా సమితి సభ్యులు పెరుమాళ్ళపల్లి ప్రకాష్ రావు, మంగళగిరి రామాంజనం, పంగా శేషగిరిరావు, కొండూరు నాగేశ్వరావు, జల్లా బ్రహ్మం, పరుచూరి రాము, అన్నవరపు సత్యనారాయణ, ఊట్ల రామకృష్ణ పాల్గొన్నారు.

## సాయుధ దళాల సర్వసన్నద్ధత కోసం కలసికట్టుతనం, ఆత్మనిర్భరత, ఆవిష్కరణల

# అవసరం ఉందన్న ప్రధానమంత్రి శ్రీనరేంద్రమోదీ

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 16:కోల్ కతాలో ఈ రోజు జరిగిన 16వ కంబైన్డ్ కమాండర్స్ కాన్ఫరెన్స్ ను ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రారంభించారు. రెండేళ్లకోసారి జరిగే ఈ సమావేశాన్ని సాయుధ దళాల అత్యున్నత స్థాయి మేధోమథన వేదికగా పరిగణిస్తారు. ఇది దేశంలోని అగ్రశ్రేణి పౌర, సైనిక నాయకత్వాన్ని ఏకతాటిపైకి తీసుకువస్తుంది. పరస్పరం అభిప్రాయాలను పంచుకోవడానికి అవకాశం కల్పిస్తుంది. భారత సైనిక సన్నద్ధతను మరింత మెరుగుపరిచేందుకు క్షేత్రస్థాయి కార్యాచరణను అందిస్తుంది. సాయుధ దళాల ప్రస్తుత ఆధునికీకరణ, మార్పులకు అనుగుణంగా 'సంస్కరణల సంవత్సరం – భవిష్యత్తు కోసం మార్పు' అనే ఇతివృత్తంతో ఈ సమావేశాలు జరుగుతున్నాయి.

ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడంతో పాటు దేశ నిర్మాణం, పైరసీ నిరోధం, సంఘర్షణ ప్రాంతాల నుంచి భారతీయ పౌరులను సురక్షితంగా తిరిగి తీసుకురావడంతో పాటు మిత్ర దేశాలకు మానవతా సహాయం, విపత్తు ఉపశమన (హెచ్ఏడీఆర్) సహాయాన్ని అందించడంలో సాయుధ దళాలు పోషించిన సమగ్ర పాత్రను ప్రధానమంత్రి అభినందించారు. 2025వ సంవత్సరాన్ని రక్షణ రంగంలో 'సంస్కరణల సంవత్సరం' గా పరిగణిస్తున్న సందర్భంలో, భవిష్యత్తు సవాళ్ళను, ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు మరింత కలసికట్టుతనం, ఆత్మనిర్భరత, ఆవిష్కరణల సాధనలో స్పష్టమైన చర్యలను వేగంగా అమలు చేయాలని రక్షణ మంత్రిత్వశాఖను ప్రధానమంత్రి ఆదేశించారు.

ఆపరేషన్ సిందూర్ సృష్టించిన కొత్త పరిస్థితుల నేపథ్యంలో బలగాల కార్యాచరణ సంసిద్ధత, అభివృద్ధి చెందుతున్న సాంకేతికత, వ్యూహాల నేపథ్యంలో భవిష్యత్ యుద్ధ రంగం గురించి ఈ సందర్భంగా అధికారులు ప్రధానమంత్రికి వివరించారు. గడచిన రెండేళ్ళలో అమలు పరచిన సంస్కరణలను, రాబోయే రెండేళ్ల ప్రణాళికను కూడా ప్రధానమంత్రి సమీక్షించారు.

వివిధ బలగాల నుంచి వచ్చిన సమాచారం, పెరుగుతున్న ప్రపంచ అనిశ్చితి నేపథ్యంలో సాయుధ దళాలకు సంసిద్ధత అవసరం అన్న ఆధారంగా వివిధ నిర్మాణాత్మక, పరిపాలన, కార్యాచరణ అంశాలపై రాబోయే రెండు రోజులలో ఈ సమావేశం సమగ్ర సమీక్షను నిర్వహిస్తుంది. అలాగే ప్రధానమంత్రి దార్శనికతను అమలు చేయడానికి అవసరమైన ప్రణాళికను రూపొందించే చర్చలు కూడా జరుగుతాయి.

# తిరుపతిలో ఫేక్ మెయిల్ అలజడి

## –ప్రైవేటు స్కూలుకు బెదిరింపులు
## –రంగంలోకి అలిపిరి పోలీసులు
## –బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ తనిఖీ
## –ఏమీ లేవని తేల్చిన పోలీసులు

తిరుపతి, సెప్టెంబర్ 16:తిరుపతి నగరంలోని యశోద నగర్ లోని ప్రైవేట్ స్కూల్‌కు మంగళవారం బాంబు బెదిరింపు కలవరం రేపింది. ఈ బెదిరింపు



మెయిల్ రావడంతో స్కూల్ యాజమాన్యం సమాచారాన్నిఅలిపిరి సీఐ రామ్ కిషోర్ హుటాహుటిన ఘటన స్థలానికి వెళ్లి తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా సిఐ, రామ్ కిషోర్ మాట్లాడుతూ తరగతి గదిలో ఆర్.డీ.ఎక్స్. ఐ.ఈ.డి. పేలుడు పదార్థాలు పెట్టినట్లు హెచ్చరించారని వివరించారు.

వి.ఎస్.వై.వార్ ప్రస్తావన తోపాటు తమిళనాడుకు చెందిన కొంతమంది పేర్లు ఉన్నాయన్నారు. తనిఖీలు చేపట్టగా అక్కడ ఏమి లభించలేదన్నారు. గతంలో వివిధ స్టార్ హోటల్స్ కి మెయిల్స్ వచ్చాయని, అదే రీతిలో ప్రస్తుతం స్కూలుకి ఈ విధంగా బాంబు బెదిరింపు మెయిల్స్ వస్తున్నాయని వివరించారు. దీనిపై కేసు నమోదు చేసి క్షుణ్ణంగా మెయిల్‌ను పరిశీలిస్తున్నామని వెల్లడించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇలాంటి మెయిల్స్ వచ్చినప్పుడు అలిపిరి పోలీస్ స్టేషన్ పరిధిలో తమకు సమాచారం అందించాలని కోరారు. ఈ తనిఖీల్లో అలిపిరిఎస్ఐ అజిత, డాగ్ స్క్వాడ, బాంబు స్క్వాడ్, సిబ్బంది పాల్గొన్నారు.

# వికసిత భారత్ లక్ష్య సాధనకు మహిళల ఆర్థిక సాధికారతే పునాది

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 16:వికసిత భారత్ లక్ష్య సాధనకు మహిళల సుస్థిర ఆర్థిక సాధికారత పునాది వంటిదని లోక్‌సభ స్పీకర్ శ్రీ ఓం బిర్లా స్పష్టం చేశారు. మహిళా సాధికారతపై ఇవాళ ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతిలో నిర్వహించిన పార్లమెంటరీ–శాసనసభ కమిటీల తొలి జాతీయ సమావేశం ముగింపు కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ఆయనతో పాటు ఆంధ్రప్రదేశ్ గవర్నర్ శ్రీ ఎస్.అబ్దుల్ నజీర్ కూడా ముగింపు ప్రసంగం చేశారు. అనంతరం కమిటీల సంయుక్త నిర్ణయాలను 'తిరుపతి తీర్మానం' పేరిట ఆమోదించడంతో సమావేశం ముగిసింది.

మహిళా సాధికారతకు ప్రాధాన్యమిస్తూ నిర్వహించిన ఈ చారిత్రక సమావేశం చివరన ఆయన తన అభిప్రాయాలను సభికులతో పంచుకున్నారు. మహిళా సాధికారత అన్నది సామాజిక అవసరం మాత్రమే కాదని, అది ఆర్థిక ఆవశ్యకతని విశదీకరించారు. మహిళల ఆరోగ్యం, విద్య, నైపుణ్యం, వ్యవస్థాపన తదితరాలపై అన్ని విధాలుగా శ్రద్ధ చూపాలన్నారు. తద్వారా దేశం తన విస్తృత మానవ మూలధనాన్ని సద్వినియోగం చేసుకుంటూ సుస్థిర సామాజిక–ఆర్థిక నమూనాతో పురోగమనానికి బాటలు వేయగలదన్నారు.

మన దేశం 2047 నాటికి వికసిత భారత్‌గా రూపొందడంలో మహిళల నాయకత్వం, సహకారం ఎంతో కీలకమని శ్రీ బిర్లా చెప్పారు. ఈ దిశగా కేంద్ర, రాష్ట్రాల చట్టసభల సభ్యులు తమ అనుభవాలను, ఆలోచనలను పంచుకునేందుకు ఇలాంటి సమావేశాలు వేదికగా ఉంటాయన్నారు.

అంతర్జాతీయ ప్రజాస్వామ్య దినోత్సవం గురించి ప్రస్తావిస్తూ– మన దేశంలో ప్రజాస్వామ్యం ఓ రాజకీయ వ్యవస్థకు పరిమితం కాదని, నాగరికత విలువల సహిత జీవన విధానమని లోక్‌సభ స్పీకర్ స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యానికి పుట్టినిల్లుగా భారత్ అనాదిగా పరిగణనలో ఉందని, సమానత్వం, సంవాదం, సమ భాగస్వామ్య సూత్రాల అమలుకు నెలవని చెప్పారు. దేశ సాంస్కృతిక, సామాజిక మూలాల్లో ప్రజాస్వామ్యం లోతుగా పాదుకున్నదని ఆయన వివరించారు.

మహిళా సాధికారతను సంక్షేమానికి పరిమితం చేయరాదని, జాతీయ పురోగమనానికి పునాదిగా పరిగణించాలని శ్రీ బిర్లా పునరుద్ఘాటించారు. మహిళల విద్యకు పెద్దపీట వేయడం ద్వారా వారి విముక్తి కోసం పోరాడిన సావిత్రిబాయి పూలే వంటి సంస్కర్తల మార్గదర్శక పాత్రను ఆయన గుర్తుచేశారు. అలాగే 100 శాతం అక్షరాస్యత సాధించడంలో భాగంగా మహారాష్ట్రలోని గ్రామీణ వృద్ధ మహిళలతో అక్షరాభ్యాసం చేయించిన పాఠశాలలను ఈ సందర్భంగా ఆయన ఉదాహరించారు. సమకాలీన విధానాలకు ఇటువంటి కార్యక్రమాలే ప్రేరణగా నిలుస్తాయని చెప్పారు.

గ్రామీణ, వెనుకబడిన నేపథ్యాల నుంచి వచ్చిన మహిళల విజయాలను ప్రముఖంగా ప్రస్తావిస్తూ– అవకాశాలు లభిస్తే పరిణామాత్మక ఫలితాలు సాధ్యమని విద్య, వ్యవస్థాపన సహా సామాజిక నాయకత్వంలో మహిళల నైపుణ్యం రుజువు చేస్తున్నదని పేర్కొన్నారు. ఇటువంటి అవకాశాలను సమాజంలోని ప్రతి రంగానికీ విస్తరించే దిశగా వినూత్న కృషికి శ్రీకారం చుట్టాలని పిలుపునిచ్చారు. తద్వారా దేశ పురోగమనంలో సమాన వాటాదారులుగా మహిళలు తమవంతు పాత్రను సమర్థంగా పోషించగలరని చెప్పారు.

లింగ ప్రతిస్పందనాత్మక బడ్జెట్ రూపకల్పన ద్రవ్య విధానానికి పరిమితం కాదని, మహిళల అవసరాలను జాతీయ ప్రగతి వ్యూహంతో సంధానించే సామాజిక–ఆర్థిక నమూనాగా దాన్ని పరిగణించాలని శ్రీ ఓం బిర్లా స్పష్టం చేశారు. బడ్జెట్లు సామాజిక న్యాయ ఉపకరణాలుగా మారితే మహిళలకు ఆరోగ్య సంరక్షణ, విద్య, నైపుణ్యం, జీవనోపాధిలో సమాన వాటా లభ్యతకు భరోసా లభిస్తుందన్నారు. తద్వారా వృద్ధి వైపు దేశ ప్రయాణంలో భాగస్వాములై నాయకత్వం వహించడానికి కూడా వారు ముందుకు రాగలరని చెప్పారు. వనరుల కేటాయింపులో లింగ దృక్కోణాన్ని అనుసరిస్తూ మహిళల సమస్యలకు పరిధులు గీయకుండా ప్రధాన ప్రణాళికలలో వాటిని భాగం చేయాలని ఆయన సూచించారు.

కేంద్ర, రాష్ట్రాల మంత్రిత్వ శాఖల్లో లింగ బడ్జెట్ విభాగాలను సంస్థాగతం చేయాలని శ్రీ ఓం బిర్లా అన్నారు. మహిళల ఆరోగ్య సంరక్షణ, విద్య, నైపుణ్యం, వ్యవస్థాపన, రుణ లభ్యత వగైరాల కోసం కేటాయింపులు పెంచుతూ, లింగ–విభజిత సమాచారం ద్వారా ఫలితాలను పర్యవేక్షించాలని ఆయన పిలుపునిచ్చారు. ఇటువంటి చర్యల ద్వారా సామాజిక న్యాయం, సార్వజనీన వృద్ధికి బడ్జెట్లు సాధనాలు కాగలవని పేర్కొన్నారు.

వినూత్న సాంకేతిక పరిజ్ఞాన సంబంధిత అవకాశాలు–సవాళ్లను ప్రస్తావిస్తూ... నేటి డిజిటల్ యుగంలో మహిళలు సాంకేతికంగా ఎంతమాత్రం వెనుకబడరాదని శ్రీ బిర్లా సూచించారు. మహిళలను చురుకైన సాంకేతికత సృష్టికర్తలుగా శక్తిమంతం చేయాలంటే డిజిటల్ అంతరం తగ్గింపు, సైబర్ భద్రతకు భరోసా, డిజిటల్ అవగాహన కార్యక్రమాల విస్తరణ వంటివి ఎంతో అవసరమన్నారు. జ్ఞాన ఆర్థిక వ్యవస్థలో వారి సమ్మిళిత భాగస్వామ్యంపై భరోసా దిశగా మునుపటి వయోజన విద్య తరహాలో మహిళల కోసం ప్రత్యేక డిజిటల్ అవగాహన కార్యక్రమాలను రూపొందించాలని ఆయన ప్రతిపాదించారు.

సమావేశంలో చివరగా– మహిళా సాధికారతకు మరింత ప్రాధాన్యమిస్తూ స్పష్టమైన ప్రణాళికను నిర్దేశిస్తున్న 'తిరుపతి తీర్మానం' ఏకగ్రీవ ఆమోదం పొందింది. అన్ని మంత్రిత్వ శాఖలు, విభాగాలలో లింగ దృక్కోణం వర్తింపు ద్వారా ఆరోగ్యం, విద్య, నైపుణ్యం, వ్యవస్థాపనకు కేటాయింపుల పెంపుతోపాటు లింగ ప్రతిస్పందనాత్మక బడ్జెట్ సంస్థాగతీకరణ, జాతీయ–రియు రాష్ట్ర స్థాయులలో సాంకేతిక సామర్థ్య బలోపేతం తదితరాల అవసరాన్ని ఈ తీర్మానం స్పష్టంగా నిర్వచించింది. డిజిటల్ అంతరం తగ్గింపు, 'స్టెమ్' (ఎస్‌టీఈఎం) రంగాల్లో మహిళల భాగస్వామ్యానికి ప్రోత్సాహం, సైబర్ భద్రతకు భరోసా, డిజిటల్ అవగాహన కార్యక్రమాల విస్తరణ, మహిళలను చురుకైన సాంకేతికత సృష్టికర్తలుగా తీర్చిదిద్దడంపైనా తీర్మానం నిబద్ధత ప్రకటించింది. దేశ పురోగమనానికి మహిళల సారథ్యం, భాగస్వామ్యం కీలకమని పేర్కొంది. జాతీయ వృద్ధి సహా వికసిత భారత్ సాకారంలో మహిళల సారథ్యాన పురోగమనమే కీలకమని స్పష్టం చేసింది. అంతిమంగా మహిళల విద్య, ఆరోగ్యం, భద్రత, గౌరవం, స్వావలంబన సాధనకు కృషి చేస్తామని ప్రతినబూనింది.

# అంధ విద్యార్థులకు సంగీత వాయిద్య పరికరాల పంపిణీ



కరీంనగర్, సెప్టెంబర్ 16:కరీంనగర్ జిల్లాలోని ప్రభుత్వ అంధుల పాఠశాల విద్యార్థులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా సంగీత వాయిద్య పరికరాలను పంపిణీ చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని సీఎం నివాసంలో పంపిణీ చేయగా ఆ సామాగ్రితో వారు పాటలు పాడి ఆకట్టుకున్నారు. జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సంగీతంలో విద్యార్థులకు తర్ఫీదునివ్వగా, సీఎం చేతుల మీదుగా వారికి వాయిద్య సామాగ్రి అందజేశారు.

మంత్రి పొన్నం ప్రభాకర్ సొంత ఖర్చులతో విద్యార్థులను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్సులో హైదరాబాద్‌కు తరలించారు. అనంతరం విద్యార్థులు పాడిన పాటల సీడీ, దివ్యదృష్టి వీడియో ఆల్బమ్‌లను సీఎం రేవంత్, మంత్రులు పొన్నం, అడ్లూరితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పుట్టు అంధులైన ఈ చిన్నారులు తమ దివ్యదృష్టితో సుదీర్ఘమైన సంస్కృత సమాసాలతో ఉన్న స్తోత్రాలను కూడా అలవోకగా పాడుతుండటం అభినందనీయమన్నారు. సొంత భాష కూడా సక్రమంగా ఉచ్చరించలేని ప్రస్తుత పరిస్థితుల్లో స్పష్టంగా రాగయుక్తంగా స్తోత్రాలు ఆలపించటం ఎంతో ఆనందాన్నిచ్చిందన్నారు. ఎంతో కృషి చేస్తే తప్ప ఇది సాధించలేరని, చిన్నారులు మరింత వృద్ధిలోకి రావాలని ఆశీర్వదించారు. కలెక్టర్ పమేలా సత్పతి విద్యారంగంలో చిన్నారులను ప్రోత్సహించటం ఆదర్శనీయమన్నారు. వీడియో ఆల్బమ్‌కు నంది శ్రీనివాస్ దర్శకత్వం వహించారు. కేబీ శర్మ సంగీతాన్ని అందించారు. లక్ష్మి గౌతమ్ వీడియో రికార్డు చేశారు. వీరితోపాటు సంగీత ఉపాధ్యాయురాలు సరళను సీఎం అభినందించారు. కఫిసో అధ్యక్షుడు పొన్నం రవిచంద్ర సమన్వయంతో సాగిన ఈ కార్యక్రమంలో ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి, సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాస్, కలెక్టర్ పమేలా సత్పతి, బాల గాయకులు సింధుశ్రీ, శ్రావణి, తిరుమల, అఖిల, నిత్యశ్రీ, జాహ్నవి, కల్పన, ప్రణయ్, సాయిరామ్, మణిదీప్, అక్షయ్, వరుణ్ తేజ్, మణిరతన్, లోహిత్‌తోపాటు ప్రభుత్వ బధిరుల పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ పమేలా సత్పతి పిల్లలతో కలిసి సచివాలయాన్ని సందర్శించారు.

# హైదరాబాద్ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలింది : కేటీఆర్



హైదరాబాద్, సెప్టెంబర్ 16:కాంగ్రెస్ పార్టీ, ముఖ్యంగా రేవంత్ రెడ్డి సృష్టించిన భయం కారణంగా హైదరాబాద్ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలింది అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. గత 22 నెలలుగా కాంగ్రెస్ పార్టీ అనుసరించిన ప్రజా వ్యతిరేక విధానాలపై రాష్ట్ర ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని కేటీఆర్ పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ నుంచి బీఆర్ఎస్ విజయయాత్రను తిరిగి ప్రారంభించాలని కేటీఆర్ పిలుపునిచ్చారు.

జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఉప ఎన్నికపై బీఆర్ఎస్ సన్నాహక సమావేశం నిర్వహించింది. కేటీఆర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి పార్టీ సీనియర్ నాయకులు, ప్రజా ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కేటీఆర్ ప్రసంగించారు.

బీఆర్ఎస్ పార్టీ జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఘన విజయం సాధిస్తుందని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. గత 22 నెలలుగా కాంగ్రెస్ పార్టీ అనుసరించిన ప్రజా వ్యతిరేక విధానాలపై రాష్ట్ర ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని ఆయన తెలిపారు. హైదరాబాద్‌ను తెలంగాణ ఆర్థిక ఇంజిన్‌గా మార్చిన గత పదేళ్ల తమ ప్రభుత్వ పాలనకు భిన్నంగా, కాంగ్రెస్ పార్టీ విధానాలు నగరాన్ని పూర్తిగా కుప్పకూల్చేలా ఉన్నాయని, ఈ విషయాన్ని నగర ప్రజలు గమనిస్తున్నారని కేటీఆర్ అన్నారు. హైదరాబాద్ అభివృద్ధి కొనసాగాలంటే భారత రాష్ట్ర సమితి మళ్లీ అధికారంలోకి రావాల్సిందేనని ప్రజలు భావిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ, ముఖ్యంగా రేవంత్ రెడ్డి సృష్టించిన భయం కారణంగా హైదరాబాద్ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలిందని, అన్ని రంగాలపై కాంగ్రెస్ అసమర్థ విధానాల ప్రతికూల ప్రభావం తీవ్రంగా ఉందని కేటీఆర్ గుర్తు చేశారు. సమాజంలోని అన్ని వర్గాలు కాంగ్రెస్ అసమర్థ విధానాల వల్ల నష్టపోయాయని ఆయన అన్నారు.

ఈ రోజు హైదరాబాద్‌లో జరిగిన జూబ్లీహిల్స్ నియోజకవర్గ సమావేశానికి కేటీఆర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఉప ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై పార్టీ సీనియర్ నేతలు కేటీఆర్‌తో చర్చించారు. ఈ ఉప ఎన్నికలో పార్టీ నేతలంతా కలిసికట్టుగా పనిచేసి, జూబ్లీహిల్స్ నుంచి భారత రాష్ట్ర సమితి విజయయాత్రను తిరిగి ప్రారంభించాలని కేటీఆర్ పిలుపునిచ్చారు.

# జర్నలిస్టులపై అక్రమ కేసులు ఎత్తివేయాలి : మాజీ ఎమ్మెల్యే చంద్రావతి

ఖమ్మం, సెప్టెంబర్ 16:జర్నలిస్టులపై ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని వైరా నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బానోత్ చంద్రావతి అన్నారు. పోలీసులు అక్రమ కేసు నమోదు చేసి వేధింపులకు గురిచేస్తున్న టీ న్యూస్ ఖమ్మం జిల్లా రిపోర్టర్ సాంబశివరావు కుటుంబాన్ని మంగళవారం ఆమె పరామర్శించారు. యూరియా కోసం ఇబ్బందులు పడుతున్న రైతుల సమస్యలపై వార్తలు సేకరిస్తున్న సాంబశివరావుపై ఖమ్మం జిల్లా కొణిజర్ల పోలీసులు అక్రమ కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే చంద్రావతి ఖమ్మం పట్టణంలోని బంగారయ్య నగర్‌లో గల సాంబశివరావు నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల దృష్టికి తీసుకువెళ్లి, ప్రశ్నించే పాత్రికేయులు, సోషల్ మీడియా యాక్టివిస్టులు, సామాజిక కార్యకర్తలపై పోలీసులు అక్రమ కేసులు నమోదు చేసి వేధించడం పరిపాటిగా మారిందని ఆమె దుయ్యబట్టారు. ఇలాంటి పరిస్థితుల్లో అధైర్య పడకుండా, పిల్లలు కలత చెందకుండా జాగ్రత్తగా ఉండాలని చెబుతూ సాంబశివరావు కుటుంబానికి పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

# 19న చలో గిరిజన సంక్షేమ కమిషనరేట్ : టీఎస్‌యూటీఎఫ్



ఖమ్మం, సెప్టెంబర్ 16:గిరిజన సంక్షేమ శాఖలోని ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు పదోన్నతుల షెడ్యూల్ విడుదల చేయడంతో పాటు ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో గిరిజన సంక్షేమ శాఖ అధికారుల నిర్లక్ష్యానికి నిరసనగా ఈ నెల 19న హైదరాబాద్ మాసాబ్ ట్యాంక్‌లోని గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ కార్యాలయం వద్ద ధర్నా కార్యక్రమం చేపట్టనున్నట్లు టీఎస్ యూటీఎఫ్ ఖమ్మం జిల్లా కార్యదర్శి బానోత్ రాందాస్ తెలిపారు. ఖమ్మం జిల్లా సింగరేణి (కారేపల్లి) మండల కేంద్రంలో మంగళవారం జరిగిన ఆ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు.

ప్రమోషన్ కౌన్సిలింగ్ నిర్వహించాలని, అనేక ఇతర సమస్యలు పరిష్కారం చేయాలని గత మూడు నెలలుగా కమిషనర్, సెక్రటరీ, మంత్రులకు విన్నవించినప్పటికీ స్పందన లేకపోవడంతో అనివార్యంగా పోరాటం చేయాల్సి వస్తోందన్నారు. ఇందుకు కమిషనర్ కార్యాలయమే కారణమని ఆరోపించారు. అప్పటికీ అధికారులు స్పందించి సమస్యల పరిష్కారానికి ముందుకు రాకపోతే ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని, అందుకు అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు బానోత్ సూర్య, ఫణికుమార్, నాగలక్ష్మి, నాగేశ్వరరావు, రామారావు, శివకోటి, రామకృష్ణ, సోమయ్య చారి, నరేంద్ర, సుజాత, సావిత్రి పాల్గొన్నారు.

# 89వ అంతర్జాతీయ ఎలక్ట్రో టెక్నికల్ కమిషన్ (ఐఈసీ) సర్వసభ్య సమావేశానికి భారత్ ఆతిథ్యం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 16:ప్రపంచవ్యాప్త 'ఓఐఎంఎల్' (ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఆఫ్ లీగల్ మెట్రాలజీ) నమూనా ఆమోద ధ్రువీకరణ పత్రం జారీచేసే 13వ దేశంగా భారత్ ఆవిర్భవించిందని కేంద్ర వినియోగదారు వ్యవహారాలు-ఆహార-ప్రజా పంపిణీ శాఖ మంత్రి శ్రీ ప్రహ్లాద్ జోషి చెప్పారు. న్యూఢిల్లీలో ఇవాళ మొదలైన 89వ అంతర్జాతీయ ఎలక్ట్రోటెక్నికల్ కమిషన్ (ఐఈసీ) సర్వసభ్య సమావేశంలో ప్రారంభోపన్యాసం చేస్తూ ఆయన ఈ మేరకు ప్రకటించారు. భారత లీగల్ మెట్రాలజీ చరిత్రలో ఇదొక కీలక ఘట్టమని పేర్కొంటూ- డిజిటల్ ఇండియా, పునరుత్పాదక ఇంధనం, సుస్థిర సాంకేతికతల పరంగానూ ప్రపంచ దేశాలకన్నా భారత్ ముందంజలో ఉందని మంత్రి ప్రకటించారు.

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ పాలనలో ఎన్నడూ లేనంత పటిష్ఠ నియంత్రణ వల్ల దేశంలో ద్రవ్యోల్బణం నేడు 11 సంవత్సరాల కనిష్ఠ స్థాయికి దిగివచ్చిందని శ్రీ జోషి తెలిపారు. దేశవ్యాప్తంగా 474 పర్యవేక్షణ కేంద్రాల ఏర్పాటుతో నిత్యావసరాల ధరలపై నిరంతర నిఘా కొనసాగించడమే ఇందుకు కారణమని ఆయన వివరించారు.

'భారత ప్రామాణిక కాలమానం' (ఐఎస్‌టీ)లో కచ్చితత్వం విస్తృతి దిశగా తమ శాఖ కృషి చేస్తున్నదని మంత్రి వెల్లడించారు. ఇందులో భాగంగా నేషనల్ ఫిజికల్ లేబొరేటరీ (ఎన్‌పీఎల్), భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో)తో సంయుక్తంగా త్వరలోనే ఒక ప్రాజెక్టును ప్రారంభిస్తామని తెలిపారు. దేశంలోని 5 ప్రదేశాల నుంచి 'ఐఎస్‌టీ' విస్తృతికి అవసరమైన సాంకేతికతల సృష్టి, మౌలిక సదుపాయాల కల్పన ఈ ప్రాజెక్టు లక్ష్యాలని ఆయన వివరించారు. వ్యూహాత్మక, వ్యూహాత్మకేతర రంగాలకు కచ్చితమైన సమయం నిర్ధారించడం అత్యంత అవశ్యమన్నారు.

ఎలక్ట్రో టెక్నికల్ రంగంలో ప్రపంచ ప్రమాణాలకు ప్రాచుర్యం కల్పించడంలో 'ఐఈసీ' గురుతర పాత్ర పోషించిందని మంత్రి పేర్కొన్నారు. ఈ మేరకు స్వచ్ఛంద, ఏకాభిప్రాయ ఆధారిత ప్రామాణీకరణపై నిబద్ధత గల ఈ సంస్థ- సాంకేతిక సామర్థ్యం, సమష్టి కృషి, సురక్షిత-సార్వజనీన-సుస్థిరత సహిత ప్రపంచానికి రూపమివ్వడంలో ఎంతగానో తోడ్పడిందని చెప్పారు. ఆవిష్కరణలు, జ్ఞాన భాగస్వామ్యం, దీర్ఘకాలిక భాగస్వామ్యాలను ప్రోత్సహించే వాతావరణంలో ప్రపంచ అగ్రశ్రేణి ఎలక్ట్రోటెక్నికల్ నిపుణులను ఒకే వేదికపైకి తెచ్చే సంప్రదాయాన్ని కొనసాగించడంపై 'ఐఈసీ'కి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఇందులో భాగంగా ఈ ఏడాది భారత ప్రమాణాల సంస్థ (బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్-బీఐఎస్) ఆధ్వర్యాన సమావేశ నిర్వహణ అవకాశం మన దేశానికి దక్కడం విశేషమన్నారు.

ప్రపంచ ప్రామాణీకరణ పయనంలో భాగంగా భారత్ పరిణామశీల ప్రగతి సాధించడంలో 'బీఐఎస్' కీలక పాత్ర పోషించిందని శ్రీ జోషి కొనియాడారు. జాతీయ ప్రమాణాల సంస్థగా సాంకేతిక చట్రాలను బలోపేతం చేస్తూ, స్థిరత్వం లక్షిత ప్రామాణీకరణను కూడా దానితో ఏకీకృతం చేసిందని పేర్కొన్నారు. అంతర్జాతీయ వేదికలపై చురుకైన భాగస్వామ్యంతో ప్రమాణాల మధ్య సమన్వయం ఇనుమడించేందుకు 'బీఐఎస్' కృషి చేసిందని చెప్పారు. ఈ క్రమంలో ఆవిష్కరణలను ప్రోత్సహిస్తూ, అన్ని రంగాలలో గ్రీన్ టెక్నాలజీ అభివృద్ధికి దోహదం చేసిందని వివరించారు.

గడచిన 11 సంవత్సరాల దేశ పురోగమనంలో ఒక సాంకేతిక నియంత్రణ సంస్థ నుంచి నిజమైన భాగస్వామి స్థాయికి 'బీఐఎస్' తన పాత్రను విస్తృతం చేసిందని మంత్రి పేర్కొన్నారు. దేశంలో నేడు దాదాపు 24,000 భారతీయ ప్రమాణాలు అమలులో ఉన్నాయని తెలిపారు. అన్ని రకాల ఉత్పత్తుల భద్రత, పనితీరు ప్రపంచ ప్రమాణాలకు అనుగుణంగా ఉండేవిధంగా ఈ ప్రమాణాలు నిర్దేశిస్తాయని చెప్పారు. ఈ సంస్థ ధ్రువీకరణ పరిధి 2014లో 14 నాణ్యత నియంత్రణ ఉత్తర్వుల (క్యూసీఓ) ద్వారా కేవలం 106 ఉత్పత్తులకు పరిమితమని మంత్రి గుర్తుచేశారు. అయితే, నేడు 186 'క్యూసీఓ'లతోపాటు 2 సమాంతర 'క్యూసీఓ'లు, ఒక ఏకీకృత సాంకేతిక నియంత్రణ చట్రం కింద 769 ఉత్పత్తులకు విస్తరించిందని వెల్లడించారు. అలాగే బంగారు ఆభరణాల నాణ్యతకు సంబంధించి 2021 జూలైలో 'హెచ్‌యూఐడీ ఆధారిత హాల్‌మార్కింగ్' విధానాన్ని అమలులోకి తేవడాన్ని ఒక కీలక సంస్కరణగా ఆయన పేర్కొన్నారు. అప్పటినుంచీ నేటిదాకా దీనికింద 48 కోట్లకుపైగా వస్తువులకు 'హాల్‌మార్క్' గుర్తింపు ఇచ్చినట్లు తెలిపారు. ఈ ప్రమాణం జారీచేసే కేంద్రాల సంఖ్య 2014లో 285 కాగా, నేడు 1,600కు చేరిన నేపథ్యంలో దేశంలోని 373 జిల్లాల్లో 2 లక్షలకుపైగా నమోదిత ఆభరణ వ్యాపార సంస్థలు ఇందులో భాగంగా ఉన్నాయని పేర్కొన్నారు. ఈ ముందడుగు ప్రాతిపదికన వెండి ఆభరణాలు, కళాఖండాల హాల్‌మార్కింగ్ ప్రక్రియను కూడా ప్రవేశపెట్టామని చెప్పారు.

దేశంలోని 'బీఐఎస్' ప్రయోగశాలల సామర్థ్యం అనేక రెట్లు పెరిగిందని, దీంతోపాటు గుర్తింపుగల ప్రయోగశాలల నెట్‌వర్క్ 2014-15లో 81 నుంచి 2025కల్లా 382కు విస్తరిస్తే- ప్రభుత్వ జాబితాలోని ప్రైవేటు ప్రయోగశాలల సంఖ్య 62 నుంచి 287కు పెరిగిందని మంత్రి తెలిపారు. మరోవైపు శిక్షణ, చైతన్యం పెంపు కార్యకలాపాల క్రమబద్ధ నిర్వహణలో భాగంగా 600కుపైగా జిల్లాల్లో నాణ్యత ప్రమాణాల ప్రాధాన్యంపై సంబంధిత సంస్థలు, అధికారులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు వివరించారు.

దేశంలో నేడు సాంకేతిక, పారిశ్రామిక రూపాంతరీకరణ భారీ స్థాయిలో సాగుతున్నదని శ్రీ జోషి అన్నారు. ఉత్పాదకత పెంపు లక్ష్యంగా తయారీ రంగంలో ఆటోమేషన్, కచ్చితత్వాలను అనుసరిస్తున్నట్లు చెప్పారు. ఈ మేరకు "స్మార్ట్ ఫ్యాక్టరీలు, ఇండస్ట్రీ 4.0, సైబర్-ఫిజికల్ సిస్టమ్" వంటివి పారిశ్రామిక రంగ భవిష్యత్తును పునర్నిర్వచించాయని పేర్కొన్నారు. ప్రపంచంలో రెండో అతిపెద్ద మొబైల్ ఫోన్ తయారీదారు స్థాయి నుంచి ఎలక్ట్రిక్ వాహనాలు, సౌరశక్తి సాంకేతికతలలో శరవేగంగా పురోగమించే మార్కెట్లలో ఒకటిగా భారత్ రూపొందిందని గుర్తుచేశారు. ప్రగతిపై ప్రగాఢ ఆకాంక్షకు విధానపరమైన మద్దతు లభించడమేగాక సమష్టి కృషితో వాటి అమలు ద్వారా దేశ పురోగమనం వేగం పుంజుకున్నదని చెప్పారు.

సుస్థిర ప్రగతి, వాతావరణ మార్పుపై పునరుత్థాన శక్తిపై జాతీయ దృక్పథమే ఎలక్ట్రోటెక్నికల్, ఇంధన రంగాల్లో భారత్ ముందంజకు కారణమని మంత్రి వివరించారు. శిలాజ ఇంధనాల పరాధీనత నుంచి పునరుత్పాదక ఇంధనం, కాలుష్యరహిత సాంకేతికత, స్వల్ప కర్బన ఉద్గార మౌలిక సదుపాయాల దిశగా మన దేశం వినూత్న మార్పులు సాధించిందన్నారు. జి-20 కూటమికి 2023లో అధ్యక్షత వహించినపుడు కూడా ఇంధన మార్పిడి, సార్వజనీన మౌలిక సదుపాయాలను ప్రాధాన్య రంగాలుగా పరిగణించి నిశితంగా దృష్టి సారించిందని గుర్తుచేశారు.

ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్ల రంగంలో భారత్ ప్రపంచ కూడలిగా ఆవిర్భవించే దిశగా ఉత్పత్తి సంధానిత ప్రోత్సాహక పథకాలు, భారీ పారిశ్రామిక కారిడార్లు, సెమీకాన్ ఇండియా కార్యక్రమం, బహుముఖ ఫలితాధారిత పెట్టుబడులు వంటివి ఎంతగానో తోడ్పడుతున్నాయని మంత్రి స్పష్టం చేశారు. అలాగే నేషనల్ గ్రీన్ హైడ్రోజన్ మిషన్, 'పీఎం-కుసుమ్', 'పీఎం సూర్య ఘర్ యోజన', 'ఫేమ్ ఇండియా' పథకం వంటివి కాలుష్యరహిత సాంకేతికతల ద్వారా భారత రూపాంతరీకరణకు బాటలు వేస్తున్నాయని చెప్పారు.

అంకుర భారత్ (స్టార్టప్ ఇండియా), డిజిటల్ భారత్ వంటి ప్రగతిశీల కార్యక్రమాల చేయూత ద్వారా దేశ యువత ఎలక్ట్రోటెక్నికల్ రంగంలో ఆవిష్కరణ-పర్యావరణ స్పృహ కలగలసిన సుస్థిర సాంకేతిక పరిజ్ఞానాలకు మార్గనిర్దేశం చేస్తున్నదని శ్రీ జోషి చెప్పారు. ఈ సమావేశంలో భాగంగా నిర్వహించే ప్రదర్శనలో వ్యవసాయం, ఆరోగ్య సంరక్షణ నుంచి అత్యాధునిక మౌలిక సదుపాయాలు, ఏఐ సహా డిజిటల్ పరిష్కారాల దాకా ఆయా రంగాల్లో సుస్థిర భవిష్యత్తు లక్ష్యంగా సాంకేతికతను వినియోగించుకునే అంకుర సంస్థలు, పారిశ్రామిక సంఘాలు కృషి ప్రస్ఫుటం అవుతుందని తెలిపారు. ఇది కేవలం ప్రదర్శన కాదని, అర్థవంతమైన చర్చలతోపాటు సహకారం, భాగస్వామ్యాలకు వేదికని ఆయన వివరించారు.

ఈ కార్యక్రమాన్ని భారత ఉమ్మడి మానవాళి స్ఫూర్తిని ప్రతిబింబించే ఒక వేడుకగా ఆయన అభివర్ణించారు. ఈ మేరకు మన సుసంపన్న వారసత్వం, వైవిధ్యం, సాదర ఆతిథ్యాన్ని ప్రస్ఫుటం చేసే విధంగా సాంస్కృతిక కార్యక్రమాలను రూపొందించినట్లు మంత్రి తెలిపారు. స్థిరత్వంతో పురోగమిస్తున్న శక్తిగానే కాకుండా ఐక్యత, సృజనాత్మకత, సంప్రదాయాలతో పరిఢవిల్లే నాగరకత దృష్టితో చూడాలని వీక్షకులకు సూచించారు.

డిజిటల్ ఆవిష్కరణలు, పునరుత్పాదక ఇంధనం, సుస్థిర సాంకేతికతల పరంగా అంతర్జాతీయ స్థాయిలో భారత్ ముందంజ వేసిందని మంత్రి సగర్వంగా ప్రకటించారు. ఆలోచనలు, చర్చలు, సహకారం, ఎలక్ట్రోటెక్నికల్ ప్రామాణీకరణ, సుస్థిర ఆవిష్కరణలపై ప్రపంచవ్యాప్త కార్యాచరణ రూపకల్పనలో ప్రస్తుత 89వ 'ఐఈసీ' సర్వసభ్య సమావేశం కీలక పాత్ర పోషించగలదని ఆశాభావం వ్యక్తం చేస్తూ మంత్రి తన ప్రసంగం ముగించారు.

# మెనూ పాటించకపోతే చర్యలు : తాసీల్దార్ శ్రీధర్ బాబు

నల్గొండ, సెప్టెంబర్ 16: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వహించకుండా, ప్రభుత్వ ఆదేశానుసారం మెనూ పాటించాలని చందంపేట తాసీల్దార్ శ్రీధర్ బాబు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కేజీబీవీ పాఠశాలలో విద్యార్థినుల పట్ల నిర్లక్ష్యం వహించకుండా మెనూ తప్పకుండా పాటించాలని ఎస్ఓ జ్యోతికి సూచించారు. ఉపాధ్యాయులు సమయ పాలన పాటించాలన్నారు. మధ్యాహ్న సమయంలో వారానికి రెండుసార్లు మండల స్థాయి అధికారులు సందర్శించనున్నట్లు తెలిపారు. అనంతరం విద్యార్థినులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు.

# ప్రతి బిడ్డకు సంపూర్ణ పోషణతో పాటు విద్య : సీడీపీఓ నిర్మల



నల్గొండ, సెప్టెంబర్ 16:పుట్టిన ప్రతి బిడ్డను సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఇచ్చేందుకు పోషణతో పాటు వారికి విద్య కూడా చాలా అవసరమని నల్లగొండ సీడీపీఓ తూముల నిర్మల అన్నారు. ఐసిడిఎస్ ప్రాజెక్ట్ నల్లగొండ ఆధ్వర్యంలో "పోషన్ బీ - పడాయి బీ మూడు రోజుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా రెండో రోజు మంగళవారం టీఎన్‌జీఓఎస్ భవన్‌లో అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాల్య దశలోనే బిడ్డకు సరైన ఆహారం, విద్య, అభివృద్ధి అవకాశాలు కల్పించాలన్నారు. మూడు నుంచి ఆరు సంవత్సరాల వయస్సు గల పిల్లలందరికీ మంచి పౌష్టికాహారం అందించాలన్నారు.

శారీరక, మానసిక, సామాజిక అభివృద్ధికి ప్రీస్కూల్ కార్యక్రమాలు సక్రమంగా నిర్వహించాలని చెప్పారు.

ప్రతి బిడ్డ సమగ్రంగా ఎదగాలంటే మన వంతు కృషి అవసరమని వివరించారు. 0-6 సంవత్స రాలలోపు పిల్లల్లో జరిగే అభివృద్ధి క్షేత్రాల గురించి ప్రేరణ, ఇసిసిఇ, పోషణ, శ్యాం, మామ్ లపై అవగాహన కల్పించారు. నాణ్యమైన బాల్య అభివృద్ధి సంరక్షణ, విద్య, మెదడు పెరుగుదల వంటి ముఖ్యమైన అంశాలపై ప్రాజెక్టర్ సహాయంతో పీపీటీ ప్రజెంటేషన్ ద్వారా సులభంగా అర్థమయ్యేలా, ప్రాక్టికల్ యాక్టివిటీలతో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు పార్వతి, జయమ్మ, మల్లేశ్వరి, లక్ష్మమ్మ, మంజుల, శ్రీలత, ప్రణీత, పద్మ, సరస్వతి, వినోదకుమారి, అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లు పాల్గొన్నారు.

# నిట్‌లో ప్రపంచ ఓజోన్ దినోత్సవ వేడుకలు

హనుమకొండ, సెప్టెంబర్ 16: నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్)లోని సెంట్రల్ రీసెర్చ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఫెసిలిటీ (సీఆర్ఐఎఫ్), అజిలెంట్ టెక్నాలజీస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, అక్షయలాబ్ టెక్లతో సంయుక్తంగా ప్రపంచ ఓజోన్ దినోత్సవం సందర్భంగా ఒకరోజు సాంకేతిక శిక్షణ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. 'పర్యావరణ స్థిరత్వం కోసం ఆధునిక విశ్లేషణాత్మక సాంకేతికతలు' అనే థీమ్‌తో జరిగిన ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు, అధ్యాపకులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

నిపుణుల ప్రసంగాలు, ప్రాక్టికల్ ప్రదర్శనలు, పరికరాల ప్రత్యక్ష వాక్‌త్రూలతో పాటు ఎల్‌సీఎంఎస్‌ఎంఎస్, జీసీఎంఎస్‌ఎంఎస్, ఐసీపీఎంఎస్, స్పెక్ట్రోస్కోపీ, మైక్రోప్లాస్టిక్స్?? డిటెక్షన్, నమూనా తయారీ విధానాలు, డేటా విశ్లేషణ, పర్యావరణ పరిశీలనలలో వాటి ఉపయోగాలపై ప్రత్యేక సెషన్లు నిర్వహించారు. డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి పర్యావరణ స్థిరత్వం ప్రాముఖ్యతను వివరించారు.

ప్రొఫెసర్ సోనవానే శిరీష్‌హరి (డీన్ -ఆర్ అండ్ డీ) సంస్థ పరిశోధనా కార్యక్రమాల గురించి మాట్లాడారు. సీఆర్ఐఎఫ్ హెడ్ ప్రొఫెసర్ ఎ.వీరేశ్‌బాబు అధునాతన పరిశోధనలకు మద్దతు అందించడంలో సీఆర్ఐఎఫ్ గురించి వివరించారు. ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డి.రవికుమార్, అజిలెంట్ టెక్నాలజీస్ అకౌంట్ మేనేజర్ శేష్‌కుమార్, టెక్నికల్ ఆఫీసర్లు వి.సుధాకర్, జి.ఎస్.ఆర్. సంజీవిని, సిబ్బంది పాల్గొన్నారు.

# బీహెచ్‌ఈఎల్ చౌరస్తా నుంచి అమీన్‌పూర్‌కు రోడ్డు కనెక్టివిటీకి ఎంపీ రఘునందన్ రావు డిమాండ్



మెదక్, సెప్టెంబర్ 16:బీహెచ్ఈఎల్ చౌరస్తా నుంచి అమీన్‌పూర్‌కు రూ.100 కోట్లతో డైరెక్టుగా రోడ్డు కనెక్టివిటీ చేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్‌ను కోరడం జరిగిందని ఎంపీ రఘునందన్ రావు అన్నారు. మంగళవారం జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్, ఎంపీ రఘునందన్ రావు కానుకుంటలో పర్యటించారు. భేల్ (బీహెచ్ఈఎల్) నుంచి అమీన్‌పూర్ టూ సుల్తాన్‌పూర్ మెడికల్ డివైస్ పార్క్ వరకు రోడ్డు కనెక్టివిటీ గురించి ఆయన కమిషనర్ కర్ణన్ కి వివరించారు.

నాలాకు అనుకోని ఉన్న ఎంక్రోచ్‌మెంట్స్‌ను తొలగించి నాలాపై నుంచి రోడ్డును వేస్తే ప్రజలకు ఎంతో ఉపయోగం ఉంటుందని, దీని ద్వారా వాహనదారులకు ట్రాఫిక్ కష్టాలు తీరుతాయని కమిషనర్‌కు ఆయన వివరించారు.

ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. రోడ్డు కనెక్టివిటీ కోసం గతంలో జీ హెచ్ ఎం సి కౌన్సిల్ సమావేశంలో ప్రస్థావించడం జరిగిందన్నారు. గత నెల రోజుల నుంచి ప్రతీ రోజు మానిటర్ చేయడంతో కమిషనర్ కర్ణన్ డైరెక్ట్‌గా ఫీల్డ్ విజిట్‌కు రావడం జరిగిందని తెలిపారు. రూ.100 కోట్లుతో వంద రోజుల వ్యవధిలో రోడ్డు పనులు మొదలుపెట్టాలని, లేని పక్షంలో నిరసన కార్యక్రమం చేపడ్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు నర్సింగ్ గౌడ్, ఈర్ల రాజు, ఎడ్ల రమేశ్, అధికారులు తదితరులు పాల్గొన్నారు

# రైతులకు బీఆర్ఎస్ నాయకుడి భోజన సదుపాయం



ఖమ్మం, సెప్టెంబర్ 16:యూరియా బస్తాల కోసం పాల్వంచ కో-ఆపరేటివ్ సొసైటీ కార్యాలయం వద్ద ఉదయం నుండి క్యూ లైన్లలో వేచి ఉన్న 250 మంది రైతులకు బీఆర్ఎస్ పార్టీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నాయకుడు, పాల్వంచ కో-ఆపరేటివ్ సొసైటీ ఉపాధ్యక్షుడు కాంపెల్లి కనకేశ్ పటేల్ ఆధ్వర్యంలో మంగళవారం భోజన సదుపాయం ఏర్పాటు చేశారు. రైతులకు పాల్వంచ పట్టణంలోని ఒడ్డుగూడెం ప్రాంతంలో గల దివ్యశ్రీ ప్యూరిఫైడ్ డ్రింకింగ్ వాటర్ యజమాని తోట సతీష్ ఉచితంగా మినరల్ వాటర్ ను సరఫరా చేశారు.

ఈ సందర్భంగా కాంపల్లి కనకేశ్ మాట్లాడుతూ.. పాల్వంచ మండలంలోని దూర ప్రాంతాల రైతులు యూరియా కోసం ఉదయాన్నే వచ్చి క్యూ లైన్ లో సాయంత్రం వరకు వేచి ఉంటున్నారని, అందుకే వారికి మధ్యాహ్నం భోజన సదుపాయం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో పాల్వంచ సొసైటీ ఆఫీస్ వద్ద యూరియా అందించే ప్రతిరోజు ఇలాగే భోజన సదుపాయం ఏర్పాటు చేస్తానని చెప్పారు.

భోజనం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన బిఆర్ఎస్ పార్టీ పాల్వంచ పట్టణ అధ్యక్షుడు మంతపురి రాజు గౌడ్ మాట్లాడుతూ.. గత 45 రోజులుగా యూరియా కోసం రైతులు సొసైటీ కార్యాలయాల వద్ద పడిగాపులు కాస్తున్నారని, రైతులకు సరిపడా యూరియా అందించడం ఈ ప్రభుత్వానికి చేత కావడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు సంగ్లోత్ రంజిత్, మారుమూళ్ల కిరణ్, కొత్తచెరువు హర్షవర్ధన్, పూజాల ప్రసాద్, ఆలకుంట శోభన్, గంగాధరి పుల్లయ్య, వల్లపిన్ని వెంకటేశ్వర్లు, పోసారపు అరుణ్, కుమ్మరికుంట్ల వినోద్, గజ్జల రితిక్, కొండే మనోజ్, కూరెళ్లి మురళి మోహన్, ఆలి, సిహెచ్ ప్రవీణ్ , కొమ్మాలపాటి నిఖిల్, గడ్డం శ్రీకాంత్, తోట సతీష్ పాల్గొన్నారు.

# మియాపూర్ డిపోలో విషాదం.. గుండెపోటుతో కండక్టర్ మృతి

హైదరాబాద్, సెప్టెంబర్ 16: మియాపూర్ డిపోలో విషాదం నెలకొంది. ఓ కండక్టర్ గుండెపోటుతో ప్రాణాలు కోల్పోయాడు. కండక్టర్ మృతి పట్ల తోటి ఉద్యోగులు తీవ్రగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

వివరాల్లోకి వెళ్తే.. పందరి అనే వ్యక్తి మియాపూర్ డిపోలో కండక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఇవాళ ఉదయం డ్యూటీకి వచ్చిన పందరి.. వాష్‌రూమ్‌కు వెళ్లాడు. అక్కడే కుప్పకూలిపోయాడు. పందరిని గమనించిన తోటి ఉద్యోగులు.. ఆస్పత్రికి తరలించారు. గుండెపోటుతో కండక్టర్ ప్రాణాలు కోల్పోయినట్లు వైద్యులు నిర్ధారించారు. దీంతో డిపోలో విషాదఛాయలు అలుముకున్నాయి.

పొద్దున్నే డ్యూటీకి వచ్చిన పందరి.. తమతో మాట్లాడి వాష్‌రూంకు వెళ్లొస్తా అని చెప్పిన కొద్ది నిమిషాలకే విగతజీవిగా మారడంతో తోటి ఉద్యోగులు షాక్ అయ్యారు. యువకుడైన పందరి కళ్ళముందే మృత్యువాత పడటం చూసి సీనియర్ ఉద్యోగులు కన్నీరు పెట్టుకున్నారు.

# వాహన రంగ తయారీలో ప్రపంచదేశాల్లో అగ్ర స్థానంలో నిలవాలన్నది భారత్ లక్ష్యం: నితిన్ గడ్కరీ

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 16:వాహన రంగ తయారీ, హరిత రవాణా, మౌలిక సదుపాయాలకు సంబంధించిన ఆవిష్కరణలలలో ప్రపంచంలోనే అగ్రగామి దేశంగా భారత్‌ను నిలబెట్టేందుకు ఒక ప్రతిష్ఠాత్మక రోడ్‌మ్యాప్‌ను కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రి ఆవిష్కరించారు. ఈ మేరకు ఢిల్లీలో జరిగిన అంతర్జాతీయ వ్యాల్యూ సదస్సు- 2025లో ఇవాళ ప్రకటన చేశారు.

భారత్ ఇప్పుడు జపాన్‌ను అధిగమించి ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆటోమొబైల్ మార్కెట్‌గా అవతరించింది. రాబోయే ఐదు సంవత్సరాలలో అగ్ర స్థానంలోకి దూసుకెళ్లాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. " ప్రపంచంలో ఉన్న అన్ని ప్రధాన వాహన కంపెనీలు ఇప్పుడు భారత్‌లో ఉన్నాయి. వాటి దృష్టి అసెంబ్లింగ్ నుంచి భారత్ నుంచి ప్రపంచానికి వాహనాలను ఎగుమతి చేయడం వైపు మళ్లింది" నితిన్ గడ్కరీ అన్నారు. దేశీయ ద్విచక్ర వాహన రంగ ఉత్పత్తిలో 50 శాతం కంటే ఎక్కువ ఎగుమతి అవుతోందని, ఇది ప్రపంచంలో బలపడుతున్న భారత్ స్థానాన్ని తెలియజేస్తోందని ప్రధానంగా చెప్పారు.

హరిత రవాణా గురించి మాట్లాడుతూ.. ఎలక్ట్రిక్ వాహనాలు, హైడ్రోజన్ ఇంధనం, ప్రత్యామ్నాయ ఇంధనాలలో భారత్ నాయకత్వ స్థానాన్ని ప్రధానంగా ప్రస్తావించారు. "మేం ఇప్పటికే హైడ్రోజన్ ట్రక్కులను ప్రారంభించాం. పది మార్గాల్లో ప్రయోగాత్మక ప్రాజెక్టులు నడుస్తున్నాయి. ప్రపంచాన్ని హరిత వాహనాలతో నడిపించడమే మా లక్ష్యం'' అని అన్నారు. టాటా మోటార్స్, అశోక్ లేలాండ్, రిలయన్స్, ఇండియన్ ఆయిల్ వంటి కంపెనీల మద్దతుతో.. హైడ్రోజన్ మౌలిక సదుపాయాల కల్పనను వేగవంతం చేసేందుకు ప్రభుత్వం రూ. 600 కోట్ల గ్రాంట్లను అందించింది. ప్రస్తుతం క్రియాశీల వరీక్షల్లో ఉన్న ఐసోబుటనాల్, బయో-తారు వంటి కొత్త ఇంధనాల విషయంలో పురోగతి సాధిస్తున్నట్లు తెలిపారు.

భారతదేశంలో రహదారులకు సంబంధించిన మౌలిక సదుపాయాలు కూడా భారీ పురోగతిని సాధించాయి. "భారత్ ఇప్పుడు ప్రపంచంలోనే రెండో అతిపెద్ద రహదారి వ్యవస్థను కలిగి ఉంది. మేం ప్రయాణ సమయాన్ని బాగా తగ్గించాం. పానిపట్ నుంచి ఢిల్లీ విమానాశ్రయానికి మూడు గంటలకు బదులుగా ఇప్పుడు కేవలం 35 నిమిషాలు పడుతోంది" అని వ్యాఖ్యానించారు. చెన్నై-బెంగళూరు ఎక్స్‌ప్రెస్‌వే, రూ. 23,000 కోట్ల బెంగళూరు రింగ్ రోడ్ వంటి కీలక ప్రాజెక్టులు అనుసంధానత రూపురేఖలను మార్చేందుకు, పట్టణ రద్దీని తగ్గించడానికి సిద్ధంగా ఉన్నాయి.

సుస్థిరత ఇతివృత్తంగా మంత్రి ప్రసంగం కొనసాగింది. ''మేం వ్యర్థాలను సంపదగా మారుస్తున్నాం. ఘాజీపూర్ నుంచి వచ్చిన 80 లక్షల టన్నుల వ్యర్థాలను రోడ్డు నిర్మాణంలో ఉపయోగించాం. మేం అక్కడ పేరుకుపోయిన చెత్త ఎత్తును ఏడు మీటర్లు తగ్గించాం" అని మంత్రి అన్నారు. వరి పంట వ్యర్థాల నుంచి తయారు చేసిన బయో-తారు పరీక్షల విజయాన్ని గురించి ఆయన ప్రస్తావించారు. ఇది పెట్రోలియం ఆధారిత తారు కంటే మెరుగైన పనితీరు కనబరిచిందని అన్నారు. ఇది వంట వ్యర్థాల దహనాన్ని తగ్గించేందుకు ఉపయోగపడుతుందని తెలిపారు.

ప్రీకాస్ట్ ఆధారిత రహదారుల నిర్మాణం, టన్నెల్ ఇంజనీరింగ్, హైడ్రోజన్ రవాణా వ్యవస్థలు, చక్రీయ ఆర్థిక వ్యవస్థ పరిష్కారాలు వంటి కీలక ఆవిష్కరణ రంగాలలో ప్రపంచ స్థాయి భాగస్వామ్యాలకు నితిన్ గడ్కరీ పిలుపునిచ్చారు. "మనకు వనరుల సమస్య లేదు. మన రోడ్లకు ఆదాయం కూడా ఉంది. మన ఆదాయం బలంగా ఉంది. మనకు కావలసింది మీ ఆవిష్కరణ, మీ సాంకేతికత, మీ సహకారం'' అని ఆయన అంతర్జాతీయ ప్రతినిధులకు తెలిపారు.

# జాతీయ కీలక ఖనిజ మిషన్ కింద సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ పై సదస్సును నిర్వహించనున్న గనుల మంత్రిత్వ శాఖ

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 16:భారత ప్రభుత్వ జాతీయ కీలక ఖనిజ మిషన్ (నేషనల్ క్రిటికల్ మినరల్ మిషన్ - ఎన్సీఎంఎం) కింద సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ) పై కేంద్ర గనుల మంత్రిత్వ శాఖ 16 సెప్టెంబర్ 2025న హైదరాబాద్ లో సదస్సును నిర్వహిస్తోంది.

ఈ కార్యక్రమంలో కీలకమైన ఖనిజ బ్లాకుల వేలం ఆరో విడత ప్రారంభోత్సవం కూడా జరుగుతుంది.

కీలకమైన ఖనిజాలలో పరిశోధన, అభివృద్ధి, ఆవిష్కరణలను వేగవంతం చేయడానికి, భారతదేశ ఇంధనం, సాంకేతికత, వ్యూహాత్మక రంగాలను బలోపేతం చేయడానికి ప్రభుత్వం చేపట్టిన ఈ సదస్సు ప్రముఖంగా వివరిస్తుంది.

ఇది స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక, బలమైన భాగస్వామ్యాలు, మొత్తం ప్రభుత్వ విధానం ద్వారా ఎన్సీఎంఎం కు పునాది వేస్తుంది.

కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి శ్రీ జి. కిషన్ రెడ్డి ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహిస్తారు. స్వావలంబనను పెంపొందించడం, పెట్టుబడులను ప్రోత్సహించడం, కీలకమైన ఖనిజాలలో సాంకేతికతను అభివృద్ధి చేయడం కోసం ఈ సదస్సులో కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తారు.

కీలకమైన ఖనిజాల రంగంలో పరిశోధన, అభివృద్ధిని ముందుకు తీసుకెళ్ళే సమగ్ర ప్రణాళికను రూపొందించడానికి పరిశ్రమ, ఆర్ అండ్ డి, విద్యాసంస్థలతో కలిసి గుర్తింపు పొందిన సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ (హబ్స్) ను ఈ సదస్సు ఒకే వేదికపైకి తెస్తుంది.

భారత్ ను కీలక ఖనిజాల శుద్ధికి ప్రధాన కేంద్రంగా మార్చడంపై గనుల మంత్రిత్వ శాఖ-సీఈఈడబ్ల్యూ నివేదికను ఈ సదస్సులో విడుదల చేస్తుంది.

భారతదేశ వ్యూహాత్మక ఖనిజ లక్ష్యాలకు అనుగుణంగా దేశీయ మైనింగ్, సరఫరా వ్యవస్థలను బలోపేతం చేయడానికి ప్రభుత్వ నిబద్ధతకు ప్రతీకగా ఎన్సీఎంఎం కింద గుర్తింపు పొందిన సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ కు అవార్డులు కూడా ప్రదానం చేస్తారు.

# త్వరలోనే యావత్ దేశానికి నక్సలిజం ముప్పు నుంచి విముక్తి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 16:జార్ఖండ్‌లోని హజారీబాగ్‌లో ఈ రోజు నిర్వహించిన నక్సల్ వ్యతిరేక ఆపరేషన్‌లో భారీ విజయం సాధించిన కేంద్ర రిజర్వ్ పోలీస్ బలగాల (సీఆర్‌పీఎఫ్) కోబ్రా బెటాలియన్, జార్ఖండ్ పోలీసులను కేంద్ర హోం, సహకార మంత్రి శ్రీ అమిత్ షా ప్రశంసించారు.

సామాజిక మాధ్యమం "ఎక్స్" వేదికగా చేసిన ఒక పోస్టులో కేంద్ర హోంమంత్రి శ్రీ అమిత్ షా ఇలా పేర్కొన్నారు. జార్ఖండ్‌లోని హజారీబాగ్ లో ఈరోజు జరిగిన నక్సల్ వ్యతిరేక ఆపరేషన్‌లో సెంట్రల్ రిజర్వ్ పోలీస్ బలగాల (సీఆర్‌పీఎఫ్) కోబ్రా బెటాలియన్, జార్ఖండ్ పోలీసులు భారీ విజయాన్ని సాధించారు. ఈ ఆపరేషన్‌లో రూ. 1 కోటి రివార్డు ఉన్న నక్సల్ కమాండర్ సీసీఎమ్ సహదేవ్ సోరెన్ అలియాస్ పర్వేష్ హతమయ్యారు. మరో ఇద్దరు నక్సల్స్.. రఘునాథ్ హెంబ్రామ్ అలియాస్ చంచల్, బిర్సెన్ గంజు అలియాస్ రామ్ ఖేలావన్‌లను కూడా భద్రతా దళాలు మట్టుబెట్టాయి. ఈ నక్సల్ వ్యతిరేక ఆపరేషన్ తరువాత ఉత్తర జార్ఖండ్‌లోని బొకారో ప్రాంతంలో నక్సలిజం ముప్పు పూర్తిగా తొలగిపోయిందని శ్రీ అమిత్ షా ప్రకటించారు. త్వరలోనే యావత్ దేశం నక్సలిజం ముప్పు నుంచి విముక్తి పొందుతుందని కేంద్ర హోంమంత్రి పేర్కొన్నారు.

# 17, 18న ఫ్లెక్సీ ప్రింటింగ్ షాపులు బంద్

నల్గొండ, సెప్టెంబర్ 16:ఫ్లెక్సీ ఇండస్ట్రీ పై మెటీరియల్, కలర్స్, ముడి సరుకులపై కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ విపరీతంగా పెంచడాన్ని నిరసిస్తూ ఈ నెల 17, 18 తేదీల్లో రెండు రోజులు ఫ్లెక్సీ షాపులు బంద్ చేస్తున్నట్లు యాదాద్రి భువనగిరి జిల్లా అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు వల్లందాన్ మహేష్, బోయిని పరమేష్ యాదవ్ తెలిపారు. మంగళవారం భూదాన్ పోచంపల్లి పట్టణ కేంద్రంలో ఫ్లెక్సీ షాపులు బంద్ ప్రకటిస్తూ పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జీఎస్టీ పెంచడం వల్ల ఇండస్ట్రీపై మోయలేని భారం పడుతుందని, దీనిపై ఆధారపడిన వారు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఇబ్బందులు పడుతారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై రాష్ట్ర అసోసియేషన్, జిల్లా ఫ్లెక్సీ ప్రింటింగ్ అసోసియేషన్ రెండు రోజుల పాటు ఫ్లెక్సీ షాపులు బంద్ చేస్తున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఫ్లెక్సీ ఇండస్ట్రీ పై జీఎస్టీని ఎత్తివేయాలని వారు డిమాండ్ చేశారు.

# 'మెగా టింకరింగ్ డే' ద్వారా చరిత్ర సృష్టించిన నీతి ఆయోగ్ అటల్ ఇన్నోవేషన్ మిషన్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 16: దేశవ్యాప్తంగా ఆవిష్కరణ-వ్యవస్థాపన సంస్కృతిని ప్రోత్సహించే లక్ష్యంతో నీతి ఆయోగ్ పరిధిలో గౌరవనీయ ప్రధానమంత్రి ప్రారంభించిన 'అటల్ ఇన్నోవేషన్ మిషన్' (ఏఐఎం) ప్రపంచవ్యాప్త క్షేత్రస్థాయి ఆవిష్కరణ విప్లవాల్లో ఒకటిగా గుర్తింపు పొందింది. ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమం కింద నిర్వహించిన 'మెగా టింకరింగ్ డే-2025'లో ఒకే రోజున విద్యార్థులు భారీ సంఖ్యలో పాల్గొనడంతో 'ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్', ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్'లో స్థానం లభించడం ఒక చారిత్రక ఘట్టం. ఈ మేరకు 'స్వచ్ఛ భారత్' కింద పరిష్కారాన్వేషణ లక్ష్యంగా ఆగస్టు 12న ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో 9,467 అటల్ టింకరింగ్ ల్యాబ్ (ఏటీఎల్)ల నుంచి 4,73,350 మంది పాఠశాల విద్యార్థులు ప్రత్యక్షంగా, ఆన్‌లైన్ ద్వారా పాల్గొన్నారు. వీరికి దశలవారీగా బోధన తరగతులు నిర్వహించిన అనంతరం సొంతంగా తయారు చేసుకోగల 'వాక్యూమ్ క్లీనర్ల'ను వారు రూపొందించారు.

ఈ కార్యక్రమం కొత్త రికార్డు సృష్టించడాన్ని ఇవాళ (2025 సెప్టెంబరు 15) 'ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్', 'ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్' నిర్వాహకులు ధ్రువీకరిస్తూ అధికారిక ప్రకటన జారీచేశారు. దేశ యువతలో ఆవిష్కరణ-శాస్త్రీయ దృక్పథం పెంపొందించే 'ఏఐఎం' వినూత్న లక్ష్యసాధన దిశగా కృషికి ఈ గుర్తింపు ఒక నిదర్శనంగా నిలుస్తుంది.

ఈ సందర్భంగా అటల్ ఇన్నోవేషన్ మిషన్ డైరెక్టర్ దీపక్ బగ్లా మాట్లాడుతూ- "ఈ కార్యక్రమం గౌరవనీయ ప్రధానమంత్రి వికసిత భారత్ దార్శనికతకు అనుగుణంగా ముందుకెళ్తోంది. ఇందులో ఆవిష్కరణలు, యువశక్తి భారత్ వృద్ధి పయనానికి మూలస్తంభాలుగా నిలుస్తాయి. దేశ భవిష్యత్తు మన తరగతి గదుల్లో రూపొందే విధంగా అటల్ టింకరింగ్ ల్యాబ్‌ల ద్వారా విద్యార్థులలో సాంకేతిక నైపుణ్యాన్ని మేం ప్రోదిచేస్తున్నాం. అంతేకాకుండా విభిన్న ఆలోచన దృక్పథంతో వినూత్న స్వప్నాలకు రూపమివ్వగల, వాస్తవిక ప్రపంచ సవాళ్లను పరిష్కరించగల ఆవిష్కర్తలుగా వారిని సన్నద్ధం చేస్తున్నాం" అన్నారు.

అలాగే "మెగా టింకరింగ్ డే కేవలం ఒక రికార్డు కాదు... ఇదొక విప్లవం. మారుమూల ప్రాంతాల నుంచి హడావుడి నిండిన నగరాల దాకా అభ్యసనం, ఆవిష్కరణ, సృష్టి, సహకారం లక్ష్యంగా ఏకమైన మన యువ ఆవిష్కర్తల సమష్టి శక్తికి ఇది సంకేతం. ప్రపంచంలోని మరే దేశంలోనూ పాఠశాల విద్యా వ్యవస్థలో ఈ స్థాయి ఆవిష్కరణలను సంఘటితం చేసిన ఉదాహరణలు లేవు. మనం సరైన సాధనాలు, మార్గదర్శకత్వం, ప్రేరణ, నాయకత్వాలను సమకూర్చినపుడు భారత బాలలు రేపటి ప్రపంచానికి సరికొత్త రూపమివ్వగలరని ఈ రికార్డు రుజువు చేస్తోంది'' అని వ్యాఖ్యానించారు.

దేశం నలుమూలలాగల పాఠశాలలకు 'మెగా టింకరింగ్ డే-2025' చేరువైంది. ఈ మేరకు లెహ్, లదాఖ్, కార్గిల్ సహా కాశ్మీర్ సరిహద్దు ప్రాంతాలు, తమిళనాడులోని విరుధునగర్ వంటి ఆకాంక్షాత్మక జిల్లాలతోపాటు ఈశాన్య భారతంలోని మణిపూర్, మిజోరం, అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రాల విద్యార్థులు ఇందులో పాల్గొన్నారు. ఒక్క మాటలో- దక్షిణాన కన్యాకుమారి నుంచి పశ్చిమాన భుజ్ వరకూ సుదూర ప్రాంతాల వారు భాగస్వాములయ్యారు. తద్వారా భౌగోళిక, మౌలిక సదుపాయాల అడ్డంకులను అధిగమించగల తన సామర్థ్యాన్ని 'ఏఐఎం' ఘనంగా చాటింది. ఆ మేరకు పరిశోధన-ఆవిష్కరణల భాగస్వామ్య పయనంలో విద్యార్థులను ఒక్క తాటిపైకి తెచ్చింది.

అటల్ ఇన్నోవేషన్ మిషన్ ప్రారంభంలోనే దేశవ్యాప్తంగా 10,000కుపైగా 'అటల్ టింకరింగ్ ల్యాబ్'లు ఏర్పాటయ్యాయి. దీంతో అన్నిచోట్లా ఒక నెట్‌వర్క్ సృష్టితో విద్యార్థులు త్రీడీ ప్రింటింగ్, రోబోటిక్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటీ), ఎలక్ట్రానిక్స్ వంటి అంశాలలో సాంకేతిక నైపుణ్యాన్ని ఆచరణాత్మకంగా సముపార్జించగలరు. విద్యార్థులలో సమస్య పరిష్కారం, రూపకల్పన యోచన, వ్యవస్థాపన స్ఫూర్తిని ప్రోత్సహిస్తూ భవిష్యత్ ఆవిష్కర్తలుగా వారిని సిద్ధం చేయడమే ఈ ప్రయోగశాలల ఏర్పాటు లక్ష్యం.

## పరిశుభ్రతకు ప్రోత్సాహం.. పెండింగ్ అంశాల పరిష్కారం దిశగా గ్రామీణాభివృద్ధి విభాగం 'ప్రత్యేక ప్రక్షాళన కార్యక్రమం 5.0'

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 16:దేశవ్యాప్తంగా పరిశుభ్రతకు మరింత ప్రోత్సాహం, పెండింగ్ అంశాల పరిష్కారం దిశగా కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ పరిధిలోని గ్రామీణాభివృద్ధి విభాగం 'ప్రత్యేక ప్రక్షాళన కార్యక్రమం 5.0' చేపడుతుంది. దీనిపై పరిపాలన సంస్కరణలు-ప్రజా ఫిర్యాదుల విభాగం (డీఏఆర్‌పీజీ) జారీచేసిన మార్గదర్శకాల మేరకు అక్టోబరు 2 నుంచి 31 వరకూ ఈ కార్యక్రమం నిర్వహిస్తారు. ఈ విభాగం పరిధిలోని స్వతంత్ర సంస్థలు/సంఘాలు కూడా ఇందులో పాలుపంచుకుంటాయి. పరిశుభ్రతను మరింత సంస్థాగతీకరించడంతోపాటు అపరిష్కృత అంశాల సంఖ్య తగ్గించడం దీని లక్ష్యం.

గ్రామీణాభివృద్ధి శాఖ గత సంవత్సరం (2024 అక్టోబరు 2 నుంచి 31 దాకా) చేపట్టిన 'ప్రత్యేక ప్రక్షాళన కార్యక్రమం 4.0' కింద వివిధ కార్యకలాపాలను నిర్వహించింది. ముఖ్యంగా సమస్యల పరిష్కారంపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. తదనుగుణంగా ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంఓ), ఎంపీలు, రాష్ట్రాలు సూచించినవి సహా ప్రజా ఫిర్యాదులు-అప్పీళ్లు, అంతర-మంత్రిత్వ కమిటీ (ఐఎంసీ) నివేదించిన అంశాలపై ప్రధానంగా శ్రద్ధ పెట్టింది. ఈ కార్యక్రమం ముగిసే సమయానికి 'పీఎంఓ', రాష్ట్రాలు, 'ఐఎంసీ' సంబంధిత సూచనలతోపాటు ప్రజా ఫిర్యాదుల అప్పీళ్లను 100 శాతం పరిష్కరించింది. అయితే, ఎంపీల సూచనల్లో 96 శాతం, ప్రజా ఫిర్యాదులలో 93 శాతం వంతున మాత్రమే పరిష్కరించగలిగింది. ఈ సందర్భంగా కార్యాలయాల్లో చెత్తాచెదారం తొలగింపు, సార్వత్రిక ప్రదేశాల శుభ్రతతోపాటు కార్యాలయ గదుల నిర్వహణను గ్రామీణాభివృద్ధి విభాగం సరిదిద్దింది. ఈ కార్యక్రమం సాధించిన విజయాలను 'డీఏఆర్‌పీజీ' పరిధిలోని 'ఎస్‌సీడీపీఎం' పోర్టల్‌లో అప్‌లోడ్ చేసింది. అలాగే కార్యక్రమంపై అవగాహన పెంపు దిశగా దీనికింద చేపట్టిన కార్యకలాపాలను సామాజిక మాధ్యమాల్లో ఎప్పటికప్పుడు అధికారులు పోస్ట్ చేశారు.

# ఫొటో ఎక్స్‌పోను విజయవంతం చేయాలి : భోగ చంద్రశేఖర్




నల్గొండ, సెప్టెంబర్ 16: ఈ నెల 19, 20, 21 తేదీల్లో హైదరాబాద్ నార్సింగ్‌లో నిర్వహించే ఫొటో ఎక్స్‌పో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా ఫొటో అండ్ వీడియో గ్రాఫర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు భోగ చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. ఫొటో ఎక్స్‌పో పోస్టర్‌ను ఆవిష్కరించారు. మంగళవారం పట్టణ కేంద్రంలో మండల ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా ప్రతి మండలంలో ఫొటోగ్రాఫర్ సంక్షేమ సంఘం కోసం ప్రభుత్వం స్థలం కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. ఫొటోగ్రాఫర్లకు ప్రభుత్వం వడ్డీ లేని రుణాలను మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ఫొటోగ్రాఫర్ వీడియోగ్రాఫర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు దోరనాల గణేష్, జిల్లా కార్యవర్గ సలహాదారుడు రచ్చ వెంకటేష్, కార్యవర్గ సభ్యుడు చింతల రామకృష్ణ, మాజీ అధ్యక్షుడు గుద్దేటి పాండు, మండల ఉపాధ్యక్షుడు సీత శ్రవణ్, కేమ విష్ణుమూర్తి, ప్రధాన కార్యదర్శి మక్తల కృష్ణ, సహాయ కార్యదర్శి మాచర్ల కృష్ణానంద, కోశాధికారి రవ్వ నవీన్, కార్యవర్గ సభ్యులు సకినాల సిద్దేశ్వర, పెరమండ్ల అశోక్, ఏరవల స్వామి, చెరుపెల్లి గణేష్ పాల్గొన్నారు.

### తిరుపతి జిల్లాలో దారుణం.. నోటిలో గుడ్డలు కుక్కి ప్లాస్టర్ వేసి..

# మహిళ, పురుషుడితో పాటు ఇద్దరు చిన్నారుల హత్య

### -పిల్లలు, మృతురాలు, తన భార్య అంటూ పోలీసులను ఆశ్రయించిన భర్త వెంకటేష్



తిరుపతి సెప్టెంబర్ 16 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: జిల్లాలోని పాకాల మండలం మూలవంక అడవుల్లో బయటపడిన మృతదేహాలపై మిస్టరీ ఇంకా వీడలేదు. లభ్యమైన మృతదేహాల పక్కనున్న గోతుల్లో మరో ఇద్దరు చిన్నారుల మృతదేహాలను కూడా పోలీసులు గుర్తించారు. లభ్యమైన మహిళ, పురుషుడి మృతదేహాలకు పోలీసులు శవపరీక్షలు చేయించారు. శవపరీక్షలో మహిళ, పురుషుడు హత్యకు గురైనట్లుగా వైద్యులు నిర్ధారించారు. నోటిలో గుడ్డలు కుక్కి, ప్లాస్టర్ వేసి చంపినట్లుగా పోలీసులు గుర్తించారు. మృతుడు తమిళనాడు తంజావూర్‌కు చెందిన కలై సెల్వన్ అని వెల్లడించారు.అయితే మృతురాలు తన భార్య అంటూ భర్త వెంకటేష్ పోలీసులను ఆశ్రయించాడు. తన భార్య, పిల్లలు కూడా కనిపించడం లేదంటూ వెంకటేష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అయితే ఈ హత్య ఆస్తి కోసం జరిగిందా.. లేదా పరువు హత్యా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఘటనాస్థలంలో మద్యం సీసాలను పాకాల పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

## రాజకీయ అవినీతిలో కూరుకుపోయిన వ్యక్తి వైఎస్ జగన్

### -మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి

అమరావతి సెప్టెంబర్ 16 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: రాజకీయ అవినీతిలో కూరుకుపోయిన వ్యక్తి మాజీ సిఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అని ఎపి మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. రాజధాని అమరావతిపై జగన్ వ్యాఖ్యలు అర్థరహితం అని అన్నారు. ఈ సందర్భంగా ఆనం మీడియాతో మాట్లాడుతూ.. రాజధాని విషయంలో గతంలో ఏం చెప్పారో జగన్ కు గుర్తు లేదని, దోచుకోవడం, దాచుకోవడం, పంచుకోవడం అని చంద్రబాబుపై విమర్శలకు మతి పోయిందని మండిపడ్డారు. జగన్ అసెంబ్లీకి వచ్చి ప్రజా సమస్యలపై చర్చించాలని సూచించారు. ఏ సమస్యపై ప్రశ్నించిన సమాధానం చెబుతాం అని తెలియజేశారు. కనీసం సమస్య చెప్పుకునే పరిస్థితిలో కూడా జగన్ లేరని ఆనం రామనారాయణ రెడ్డి ఎద్దేవా చేశారు.

# కొలుకుంటున్న ఓజోన్ పొర..శుభవార్త చెప్పిన ఐక్యరాజ్యసమితి

న్యూయార్క్ సెప్టెంబర్ 16 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: ఐక్యరాజ్యసమితి శుభవార్త చెప్పింది. భూమికి రక్షణ కవచంగా ఉన్న ఓజోన్ పొర కోలుకుంటున్నట్లు వెల్లడించింది. రానున్న దశాబ్దాల్లో ఆ ఓజోన్ రంధ్రం పూర్తిగా మూసుకుపోనున్నట్లు యూఎన్ తన నివేదికలో పేర్కొన్నది. అంతర్జాతీయ దేశాల నిరంతర చర్యల వల్ల ఈ సక్సెస్ సాధ్యమైనట్లు యూఎన్ తెలిపింది. యూఎన్ వరల్డ్ మెటియోరోలాజికల్ ఆర్గనైజేషన్ దీనిపై కొత్త నివేదికను రిలీజ్ చేసింది. అంటార్కిటికాపై ఉన్న ఓజోన్ రంధ్రం గతంతో పోలిస్తే 2024లో చిన్నగా ఉన్నట్లు ఆ నివేదికలో పేర్కొన్నారు. ఐక్యరాజ్య సమితి చీఫ్ ఆంటోనియో గుటెర్రెస్ కూడా స్టేట్మెంట్ రిలీజ్ చేశారు. ఓజోన్ పొర కోలుకుంటోందన్నారు. శాస్త్రవేత్తలు ఇచ్చిన హెచ్చరికలు పనిచేసినట్లు ఆయన తెలిపారు. దీని వల్ల ప్రగతి సాధ్యమవుతోందన్నారు. ఓజోన్ బులెటిన్ 2024ను ప్రపంచ వాతావరణ సంస్థ పబ్లిష్ చేసింది. సహజసిద్ధమైన పరిణామాల వల్ల ఓజోన్ పొర సన్నగిల్లడం నిలిచిపోయినట్లు పేర్కొన్నది. కానీ దీర్ఘకాలంగా ఆలోచిస్తే, అది శాస్త్రవేత్తల ఘనతగా తెలిపారు. క్లోరోఫ్లోరో కార్బన్స్ వినియోగంపై అంతర్జాతీయంగా వత్తిడి తేవడం వల్లే ఓజోన్ పొర బలహీనపడడం ఆగినట్లు చెప్పారు. వరల్డ్ ఓజోన్ డే సందర్భంగా బులెటిన్ రిలీజ్ చేశారు. వియన్నా కన్వెన్షన్ 40వ వార్షికోత్సవాన్ని కూడా జరుపుకుంటున్నారు. ఆ నాటి సదస్సులో ప్రపంచ దేశాలు ఓజోన్ పొర సన్నగిల్లడం పట్ల తీవ్ర ఆందోళన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. 1975లో ఆ కన్వెన్షన్ జరిగింది. ఆ తర్వాత 1987లో మాంట్రియల్ ప్రోటోకాల్ రిలీజ్ చేశారు. రిఫ్రిజిరేటర్లు, ఎయిర్ కండీషనర్లు, ఏరోసోల్ స్ప్రేస్‌లో ఓజోన్ పొరను బలహీనపరిచే పదార్థాల వినియోగాన్ని తగ్గించాలని నిర్ణయించారు.ప్రస్తుతం ఓజోన్ పొర రికవరీ ట్రాక్‌లో ఉందన్నారు. ఈ శతాబ్దం మధ్య కాలం వరకు .. 1980 తరహా స్థాయికి ఓజోన్ పొర చేరుకుంటుందని అంచనా వేశారు. దీని వల్ల స్కిన్ క్యాన్సర్లు, క్యాటరాక్టులు తగ్గుతాయన్నారు. అతినీలలోహిత కిరణాల వల్ల జరిగే నష్టాలు నివారించబడుతాయని రిపోర్టులో తెలిపారు. గత ఏడాది సెప్టెంబర్ 29న అంటార్కిటికా వద్ద ఓజోన్ పొర 46.1 మిలియన్ టన్నుల మాస్ డెఫిసిట్‌తో ఉందని, ఇది 1990-2020 దశకంతో పోలిస్తే తక్కువ అని రిపోర్టులో పేర్కొన్నారు.

## ఆల్ ఇండియా బి.సి, ఎస్.సి, ఎస్.టి, మైనారిటీ సంక్షేమ సంఘం గ్రేటర్ హైదరాబాద్ జనరల్ సెక్రటరీగా కాకుమాను జ్యోతి



హైదరాబాద్ సెప్టెంబర్ 16 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );తెలంగాణ రాష్ట్ర ఆల్ ఇండియా బి.సి, ఎస్.సి, ఎస్.టి, మైనారిటీ సంక్షేమ సంఘం, గ్రేటర్ హైదరాబాద్ జనరల్ సెక్రటరీగా జ రాజేంద్రనగర్ మండలం, ఉప్పరపల్లి గ్రామంకి చెందిన సామాజిక కార్యకర్త పద్మశాలి ముద్దుబిడ్డ డాక్టర్. కాకుమాను వెర్సీ జ్యోతి నియమితులైనారు. ఈ మేరకు ఆల్ ఇండియా బి.సి, ఎస్.సి, ఎస్.టి, మైనారిటీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కొత్త విజయ భాస్కర్ నియామక పత్రాన్ని అందజేశారు.

# జీఎస్టీ రేట్ల తగ్గింపు తో దేశ ఆర్థిక వ్యవస్థకు భారీ సంస్కరణ

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 16:జీఎస్టీ రేట్లను తగ్గించడం ద్వారా ప్రజలకు, వ్యాపారులకు, దేశ ఆర్థిక వ్యవస్థకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భారీ సంస్కరణను తీసుకొచ్చారని బిజెపి జాతీయ అధికారిక ప్రతినిధి సయ్యద్ జాఫర్ ఇస్లాం అన్నారు. మంగళవారం బిజెపి రాష్ట్ర కార్యాలయం లో వేదిఒయా సమావేశం లో మాట్లాడుతూ యుపియే పాలనలో రాష్ట్రాలు, కేంద్రానికి వేర్వేరు రేట్లు ఉండేవి ? ఎయి, ౫ఞబీతీనీతి, ఇనిబీటీఎ ౕజీలీ, ఇతర అనేక పరోక్ష పన్నులు ఉండేవి. ఇవి చాలా గందరగోళాన్ని, సంక్లిష్టతను కలిగించేవి. మోదీ ప్రభుత్వంలోని ఊు సంస్కరణల ద్వారా అత్యవసర వస్తువులకు 0% పన్ను వర్తించనుంది. 28% జీఎస్టీ పరిధిలో ఉన్న వస్తువులు 18%, 12% వస్తువులు 5% లేదా 0% లోకి తగ్గించబడ్డాయి. దీని ద్వారా మధ్యతరగతి కుటుంబాలు, సామాన్య ప్రజలకు ఉపశమనం కలుగుతోంది. ఉూ సంస్కరణల ప్రధాన ఉద్దేశ్యం "ఇజీబవ నీట ఒతిలతినిణ"ని పెంచడమన్నారు. ప్రజలకు ఎక్కువ ఆదాయం అందించి వారి రోజువారీ అవసరాలకు సంబంధించిన వస్తువులను తక్కువ ధరలకు అందించటం. ఓటఇలు పాత విధానంలో అనేక రేట్లు, సంక్లిష్టత కారణంగా చాలా ఇబ్బందులు పడేవి. ఇప్పుడు 90% రీఫండ్ ఇవ్వడం ద్వారా క్యాష్ ఫ్లో సమస్యలు తొలగిపోయాయి. చాలా సులభంగా, డిజిటల్ రూపంలో చేయొచ్చు. ఇది కేవలం పన్నుల సంస్కరణ మాత్రమే కాదు. ఇది ప్రజల జీవితాన్ని సులభతరం చేసే, ఆర్థిక వృద్ధిని ప్రేరేపించే ప్రజార్థ చర్య. ఈ నిర్ణయం వ్యాపార వ్యవస్థను బలోపేతం చేస్తుంది, ఎక్కువ పెట్టుబడులు, ఎక్కువ ఉపాధి అవకాశాలను సృష్టిస్తుంది. ఇది వినియోగంపై ఆధారపడే ఆర్థిక వ్యవస్థను మరింత బలపరుస్తుంది. (ఉఆఖలో 57% భాగస్వామ్యం వినియోగం ద్వారా వస్తుంది.) ఉూ సంస్కరణలు ప్రధానమంత్రి మోదీ గారి నాయకత్వంలో చేపట్టిన గొప్ప నిర్ణయం. ఇది 1991లో జరిగిన ఆర్థిక లిబరలైజేషన్ కన్నా చాలా విస్తృత ప్రభావాన్ని చూపుతోంది, ప్రజలందరికీ నేరుగా, స్పష్టంగా లాభాలు కల్పిస్తోంది. స్థానికంగా తయారైన, దేశీయంగా ఉత్పత్తి చేసిన వస్తువులను వాడాలి. ఇది మన ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేస్తుంది, మన వ్యాపారాలను మరింత పటిష్టం చేస్తుంది.మొదటగా, ఊూలో రేట్లు సమతుల్యంగా మార్చడం, ఆదాయ పన్ను తగ్గింపు, ఖీఃఎ నిబంధనలు సడలించడం, ఆర్థిక ప్రోత్సాహక చర్యలు చేపట్టడం వంటి నిర్ణయాలు మన ఆర్థిక వ్యవస్థను ప్రేరేపిస్తున్నాయి.అమెరికా అంచనాతో పోల్చితే గత త్రైమాసిక ఉఆఖ వృద్ధి రేటు 6.5% ఉండగా, వాస్తవం 7.8% వచ్చింది. హై ఫ్రీక్వెన్సీ డేటా ప్రకారం ఊూ రేట్ల సమతుల్యీకరణ వల్ల, దేశంలో అంతర్జాతీయ ఎగుమతులు పెరుగుతున్నాయి.మొత్తం ఆర్థిక పరిస్థితి, మాక్రో స్టెబిలిటీ అందరికీ స్పష్టంగా కనిపిస్తోంది. ఈ నిర్ణయం కేవలం ఆర్థిక వ్యవస్థను ప్రేరేపించడం మాత్రమే కాదు, భారత ఆర్థిక వ్యవస్థపై దీర్ఘకాల ప్రభావం చూపుతుంది.ఇది గత 11 సంవత్సరాల్లో చేపట్టిన నిర్మాణాత్మక మరియు విధాన సంస్కరణల ఫలితం.ఊూ సుదీర్ఘ ప్రభావాలను కలిగించే, చరిత్ర సృష్టించే సంస్కరణ. ఇది సెప్టెంబర్ 3న ఆమోదించబడింది.. సెప్టెంబర్ 22న అమలవుతుంది. ఈ సంస్కరణ ప్రజలకు మంచి జీవనం అందిస్తుంది, "ఇజీబవ నీట ఒతిలతినిణ" ను ముందుకు తెస్తుంది. వినియోగాన్ని ప్రోత్సహిస్తుంది, వ్యాపారాల స్థాయిని పెంపొందిస్తుంది.ప్రధానంగా, ఇది స్వయం ఆధారిత భారత్ నిర్మాణానికి దారి తీస్తుంది ? ఇది మన దేశానికి అత్యంత ముఖ్యమైన మార్గదర్శన మన్నారు.

# నాలాలో కొట్టుకుపోయిన ముగ్గురి లభ్యం కాని ఆచూకీ

### -ఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిప్పులు

హైదరాబాద్ సెప్టెంబర్ 16 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: సీఎం రేవంత్ రెడ్డి వైఫల్యాలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిప్పులు చెరిగారు. హైదరాబాద్‌లో నాలాలో కొట్టుకుపోయిన ముగ్గురి ఆచూకీ ఇప్పటికీ లభ్యం కాకపోవడంతో.. మున్సిపల్ మంత్రిగా ఉండి రేవంత్ రెడ్డి ఏం చేస్తున్నట్టు అని కేటీఆర్ నిలదీశారు.మీ కాంగ్రెస్ సర్కారు ఘోర తప్పిదం వల్ల ఎస్ఎల్బీసీ టన్నెల్ కుప్పకూలి మరణించిన ఆరుగురి మృతదేహాలను బయటకు తీయలేక చేతులెత్తేశావు. చివరికి హైదరాబాద్‌లో నాలాలో కొట్టుకుపోయిన ముగ్గురి పార్థివదేహాలను మూడురోజులైనా గుర్తించలేవా..? ఇంతకన్నా అసమర్థత, చేతకానితనం, పరిపాలనా వైఫల్యం ఇంకోటి ఉంటదా..?? కనీసం తమ ఆప్తులను చివరి చూపు కూడా చూసుకోలేని ఆ బాధిత కుటుంబాల ఆవేదన, గుండెకోత, మానవత్వం లేని కాంగ్రెస్‌కు వినిపించడం లేదా ? అని కేటీఆర్ ప్రశ్నించారు.చిన్న పాటి వర్షానికే పొంగిపొర్లుతున్న నాలాలు, చివరికి ప్రజల ప్రాణాలు హరిస్తుంటే మున్సిపల్ మంత్రిగా కూడా ఉండి ఏం చేస్తున్నట్టు ? విపత్కర పరిస్థితుల్లో ప్రజల కష్టాలు తీర్చేందుకు ఏర్పాటుచేసిన డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్‌ను కూడా నిర్వీర్యం చేయడం వల్లే ఈ దుస్థితి. ఎస్ఎల్‌బీసీ సొరంగంలో ఆరుగురిని సజీవ సమాధి చేసి ఇప్పటికే మహాపాపం మూటగట్టుకున్నారు.. నాలాల్లో బలిచేసిన ముగ్గురి మృతదేహాలను కూడా గుర్తించకపోతే బీఆర్ఎస్ చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదు అని కేటీఆర్ స్పష్టం చేశారు.

# నాగార్జునసాగర్ డ్యామ్ జలకళ.. సాగర్‌కు పర్యాటకుల సందడి

నాగార్జునసాగర్ సెప్టెంబర్ 16 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: నాగార్జునసాగర్ డ్యామ్ జలకళను సంతరించుకుంది. ఎగువ ప్రాజెక్టులన్నీ నిండుకుండలా మారి వచ్చిన నీటిని వచ్చినట్లు దిగువకు విడుదల చేస్తుండటంతో జలాశయానికి భారీగా వరద ప్రవాహం వచ్చి చేరుతోంది. ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేపడుతూ 32,764 క్యూసెక్కుల నీటిని, కుడి కాలువ ద్వారా 9,019 క్యూసెక్కుల నీటిని, ఎడమ కాల్వద్వారా 6,325 క్యూసెక్కుల నీటిని, ఎస్.ఎల్.బి.సి ద్వారా 2,400 క్యూసెక్కుల నీటిని, లోలెవల్ కెనాల్ ద్వారా 300 క్యూసెక్కుల నీటిని మొత్తం 2,60,602 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు 26 క్రస్ట్ గేట్ల ద్వారా పరవళ్లు తొక్కుతున్న కృష్ణమ్మ అందాలను చూసేందుకు పర్యాటకులు వర్షాన్ని సైతం లెక్కచేయకుండా భారీగా తరలివచ్చారు. కృష్ణమ్మ పరవళ్లు చూసి పర్యాటకులు తమ సెల్ ఫోన్లలో సెల్ఫీలు దిగుతూ ఆనందాన్ని వ్యక్తం చేశారు. సాగర్‌లో ఉన్న పర్యాటక ప్రాంతాలైన అనుపు, బుద్ధవనం, కొత్త వంతెన, పాత వంతెన తదితర ప్రాంతాల్లో పర్యాటకుల సందడి నెలకొంది. తెలంగాణ టూరిజం ఏర్పాటు చేసిన లాంచీలో వెళ్లేందుకు పర్యాటకులు ఉత్సాహం చూపారు.

# డోలిలో మోసుకెళ్తుండగా నడిరోడ్డుపైనే ప్రసవించిన గర్భిణీ..



ఖమ్మం, సెప్టెంబర్ 16: ఓ నిండు గర్భిణి నడిరోడ్డుపైనే ప్రసవించింది. రవాణా సదుపాయం లేకపోవడంతో కుటుంబ సభ్యులు ఆమెను డోలిలో మోసుకెళ్తుండగానే పండంటి బిడ్డకు జన్మనిచ్చింది.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం బట్టిగూడెం గ్రామానికి చెందిన రవ్వ భీమేకు నెలలు నిండాయి. దీంతో ఆమెకు మంగళవారం ఉదయం పురిటినొప్పులు వచ్చాయి.

కానీ బట్టిగూడెం గ్రామానికి రవాణా సదుపాయం లేదు. దీంతో చేసేదేమీ లేక నిండు గర్భిణిని.. కుటుంబ సభ్యులు డోలిలో మోసుకెళ్లారు.

అంబులెన్స్ వచ్చే మార్గం లేకపోవడంతో, బురదలోనే 6 కిలోమీటర్ల దూరం మోసుకెళ్లగా.. పురిటినొప్పులు మరింత ఎక్కువయ్యాయి. దీంతో రవ్వ భీమే నడిరోడ్డుపైనే ప్రసవించింది. అక్కడి నుంచి తల్లీబిడ్డను ఆటోలో తీసుకెళుతుండగా, మార్గమధ్యంలో అంబులెన్స్ రావడంతో సత్యనారాయణపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తల్లీబిడ్డకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఆరోగ్యంగా ఉన్నారని డాక్టర్లు తెలిపారు.

## బిఆర్ఎస్ కబ్జాకు ట్రబుల్ షూటర్ నయ స్కెచ్ .. సామ రామమోహన్ రెడ్డి

హైదరాబాద్ సెప్టెంబర్ 16 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );బిఆర్ఎస్ ను కబ్జా చేసేందుకు బిఆర్ఎస్ ట్రబుల్ షూటర్ హరీష్ రావు నయ స్కెచ్ కు కుట్ర పన్నారని పిసిసి అధికార ప్రతినిధి సామ రామమోహన్ రెడ్డి ఆరోపించారు. మంగళవారం గాంధీ భవన్ లో మీడియా సమావేశం లో మాట్లాడుతూ కేటీఆర్ ను నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో జోనల్ ఆఫీసు కి పంపించే ప్రయత్నం కుత్రలోని భాగమే నని ఆయన పేర్కొన్నారు. జోనల్ ఆఫీసు కర్ణాటకలో ఉందని,ఈడి కేసులో హీరోయిన్ కేటీఆర్ మీద ఇచ్చిన స్టేట్మెంట్ ఆధారంగా కేటీఆర్ ను జైలుకు పంపే ప్రయత్నం చేస్తున్నారని పేర్కొన్నారు. కేసిఆర్ కుటుంబంలో ఇప్పటికే ఒకరు బయటకి వెళ్లిపోయారు,బిఆర్ఎస్ బిగ్ వికెట్ అయిన కేటీఆర్ ను బయటకి పంపే ప్రయత్నం హరీష్ రావు చేస్తున్నారన్నారు. బిఆర్ఎస్ నాకౌట్ మ్యాచ్లో జరుగుతున్న ఇంట్రెస్టింగ్ పోరులో టర్నింగ్ పాయింట్ కేటీఆర్ ఇష్యు అని బీజేపీ తాడు పట్టుకొని కేటీఆర్ ను ఇరికించే ప్రయత్నం హరీష్ రావు చేస్తున్నారన్నారు. దీనితో బీఆర్ఎస్ పార్టీ ఇంకా తెలంగాణ లో నిలబడదన్నారు.

# ఎకో టూరిజంపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలి

### -అనవసర చెత్త కనబడితే ఊరుకునేది లేదు: సిఎం చంద్రబాబు



అమరావతి సెప్టెంబర్ 16 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: మొదటి సారి సింగపూర్ వెళ్లినప్పుడు అక్కడ పచ్చదనం- పరిశుభ్రతపై పరిస్థితిని అధ్యయనం చేశానని సిఎం చంద్రబాబు నాయుడు తెలిపారు. పొరుగు సేవల సిబ్బందిని నియమించడం కూడా అదే తొలిసారి అన్నారు. సిఎం అధ్యక్షతలో రెండో రోజు కలెక్టర్ల సదస్సు నిర్వహించారు. హైదరాబాద్ లో నైట్ క్లీనింగ్ ప్రారంభించామని, పచ్చదనం- పరిశుభ్రత కార్యక్రమం తీసుకొచ్చామని తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్రమోదీ స్వచ్ఛభారత్ రిపోర్టు తానే ఇచ్చానని, స్వచ్ఛత అంటే శుభ్రతే కాదని అన్ని కోణాల్లో చూడాలని అన్నారు.ఒకప్పుడు ఆనంద ఆదివారం కూడా పెట్టామని, ఎవరికి ఏ ప్రతిభ ఉంటే దాన్ని బయటపెట్టేవాళ్లు అని పేర్కొన్నారు. ఒత్తిడి నుంచి ఉపశమనం కోసం కొన్ని కార్యక్రమాలు వచ్చాయని, లాఫింగ్ సొసైటీ, షౌటింగ్ సొసైటీలు వస్తున్నాయని చెప్పారు. సర్క్యులర్ ఎకానమీ పాలసీని అమలు చేస్తామని, సాలిడ్ లిక్విడ్ వేస్ట్ మేనేజ్ మెంట్‌పై దృష్టి పెట్టాలని సూచించారు. డ్రయిన్లను శుభ్రం చేయాల్సి ఉంటుందని, వర్షపు నీరు, ఇళ్లలోని నీరు వస్తే ఇంకిపోయేలా కొత్త టెక్నాలజీ తీసుకొచ్చామని అన్నారు. ఎకో టూరిజంపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని, అక్టోబర్ 2 నాటికి చెత్త అనేదే కనబడకూడదని అధికారులకు హెచ్చరించారు. అనవసర చెత్త కనబడితే ఊరుకునేది లేదని, చెత్త పై పన్ను కూడా తొలగించామని చంద్రబాబు స్పష్టం చేశారు.

